# వామ్మో... పీలేరు బస్టాండా...!

- అక్కడికెళితే ముక్కు మూసుకోవాల్సిందే...
- చినుకుపడితే చెరువే...
- ప్రయాణికులకు తప్పని పాట్లు
- బస్టాండు చుట్టూ చెత్తకుప్పలే...


చెరువును తలపిస్తున్న పీలేరు ఆర్టీసీ బస్టేషన్


బస్‌స్టేషన్ ఆవరణలో చెత్తకుప్పలు

పీలేరు రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పీలేరు ఆర్టీసీ బస్టాండు అంటేనే ప్రయాణికులు హడలిపోతున్నారు. చుట్టూ చెత్తకుప్పలతో ఓవైపు దుర్వాసన, మరోవైపు చిన్నపాటి వర్షం పడినా బస్టాండు నీటితో చెరువును తలపిస్తోంది. ఏళ్ల తరబడి మొక్కుబడి చర్యలతో సరిపెడుతుండటంతో ప్రయాణికులకు కష్టాలు తప్పడం లేదు. బస్టాండు చుట్టూ ఎక్కడచూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తుంటాయి. వీటి గురించి పట్టించుకునే నాథుడే లేడని, ఆర్టీసీ అధికారులు ఆదాయం చూస్తున్నారు తప్ప సమస్యల గురించి పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. బస్టాండు ఆవరణలో మురుగునీటి కాల్వల నిర్వహణ గాలికొదిలేయడంతో దుర్గంధం వెదజల్లుతూ దోమలకు ఆవాసంగా మారాయి. పీలేరు నుంచి తిరుపతి, రాయచోటి, మదనపల్లె, చిత్తూరుతో పాటు పులిచెర్ల, సదుం, రొంపిచెర్ల, భాకరాపేట, ఎర్రావారిపాళ్యం, పాకాల, ఐరాల, కలికిరి, కలకడ, వాల్మీకిపురం, సదుం, సోమల, చౌడేపల్లె, పుంగనూరు తదితర ప్రాంతాలకు ఉద్యోగ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వ్యాపారులు దైనందిన కార్యక్రమాలపై వెళుతుంటారు. అందరూ దాదాపు ఆర్టీసీ బస్సుల్లోనే వెళ్లి వస్తుంటారు. ఇటీవల ప్రభుత్వం స్త్రీ శక్తి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ప్రయాణికుల రద్దీ మరింత పెరిగింది. ఆర్టీసీ అధికారులు బస్‌స్టేషన్ ఆవరణలో కనీస వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

### నాలుగు చినుకులు రాలితే చెరువే....

పీలేరు ఆర్టీసీ బస్‌స్టేషన్ నాలుగు చినుకులు రాలితే చెరువును తలపిస్తోంది. దశాబ్ద కాలానికిపై సమస్య ఉన్నా పరిష్కార మార్గం అన్వేషించడంలో అధికారులు విఫలమయ్యారని పలువురు విమర్శిస్తున్నారు. ఆర్టీసీ ఎండీ, ఈడీ, ఆర్‌ఎం, డీఎం ఇతర అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటి వరకు ఆ సమస్యకు పరిష్కార మార్గం కానరావడం లేదు. ఆర్టీసీ నల్లగుట్ట, క్రాస్‌రోడ్, ఎస్‌కేడీ నగర్, తదితర ప్రాంతాల నుంచి మురుగునీరు వయా బస్‌స్టేషన్ వస్తుండటంతో రోజురోజుకు సమస్య జఠిలంగా మారుతోంది.


బస్టాండు లోపలికి వెళ్లే మార్గంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

### వ్యాపారుల ఇక్కట్లు వర్ణనాతీతం...

అధిక మొత్తంలో టెండర్లు వేసి ఆర్టీసీ స్థలాలను లీజుకు తీసుకుని పలువురు వ్యాపారులు సొంత ఖర్చులతో రూములు నిర్మించి రకరకాల వ్యాపారాలు చేస్తున్నారు. ఇందులో బంగారు, దుస్తులు, పండ్లు, టీ, ఆసుపత్రులు, ఫ్యాన్సీ, కూల్‌డ్రింక్స్ హోటళ్లు, ఇలా అనేక రకాల వ్యాపారాలు ఉన్నాయి. అయితే ఆర్టీసీ బస్‌స్టేషన్ ప్రాంగణంలో మురుగునీటి కాలువల నిర్వహణ గాలికి వదిలేయడంతో ఒక షాపు నుంచి ఇంకో షాపు ముందు నీరు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ఎక్కడి కక్కడే నీరు నిలిచిపోయి మురుగునీటి గుంటలుగా మారి దుర్గంధం వెదజల్లుతున్నాయి. వ్యాపారులు వేలకు వేలు ఆర్టీసీకి నెలనెలా అద్దె చెల్లిస్తున్నా మురుగునీటి కాల్వల నిర్వహణ పట్టించుకోవడం లేదు. దీంతో వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

### ఎవరూ పట్టించుకోవడం లేదు....



ఆర్టీసీ బస్‌స్టేషన్ ఆవరణ దుర్గంధం వెదజల్లుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఏమైతే మాకేం మా జీతాలు మాకు వస్తే చాలన్న నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారు. బస్టాండుకు వెళ్లాలంటేనే భయమేస్తోంది. ఎక్కడ చూసినా మురుగు, చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి.

**- ఎన్.సుభాష్, పీలేరు.**

### దుర్గంధం తట్టుకోలేకున్నాం...



బస్‌స్టేషన్ చుట్టూ మురుగునీటి కాలువలు అస్తవ్యస్తంగా మారాయి. దీంతో ఎక్కడి కక్కడే మురుగు నిలిచిపోయి కంపు కొడుతున్నాయి. దీంతో ఆర్టీసీ ప్రాంగణం పరిధిలో వ్యాపారాలు పూర్తిగా దెబ్బతింటున్నాయి. అధికారులకు చెప్పినా అదిగో ఇదిగో అంటున్నారు తప్ప చేసిందేమీ లేదు. మురుగునీటి కాలువలు తక్షణం నిర్మించాలి. చెత్తకుప్పలు తొలగించాలి

- రమేష్, వ్యాపారి, ఆర్టీసీ బస్‌స్టేషన్, పీలేరు.

### బస్టాండులోకి రావాలంటే ఇబ్బందే....



నాలుగు చినుకులు రాలితే బస్టాండు చుట్టూ మురుగునీటి ప్రవాహం. బస్టాండు ఆవరణం చెరువులా ఉంటుంది. ప్రయాణికులు లోనికి రావాలంటే మురుగునీరు తొక్కాల్సిందే. అధికారుల ప్రత్యేక చొరవ చూపి ప్రయాణీకులకు మెరుగైన వసతులు కల్పించాలి. మహిళలు, వృద్ధులు, విద్యార్థుల ఇక్కట్లు వర్ణణాతీతం. దుర్వాసన భరించలేకున్నాం.

- క్రిష్ణమూర్తినాయక్, ప్రయాణికుడు.


పట్టాభి రామాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

## వైభవంగా సీతారాముల కల్యాణం

వాల్మీకిపురం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణంలో వెలసిన పట్టాభి రామాలయంలో బుధవారం టీటీడీ ఆధ్వర్యంలో పునర్వసు సీతారాముల కల్యాణోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో సుప్రభాత సేవ, మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో విశేష పూజలు జరిగాయి. మామిడి తోరణాలు, పుష్పాలంకరణలతో తీర్చిన కల్యాణ వేదికపై సీతారాములను ఆశీనులు చేసి మంగళ వాయిద్యాల ఘోష, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. అనంతరం వేడుకలలో పాల్గొన్న దంపతులు, భక్తులకు టీటీడీ వస్త్రం, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలలో ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, వేదపండితులు, కృష్ణరాజుభట్టార్, గోకుల్, భాషికాచార్యులు, అర్చక బృందం, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలి

- జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్


పంట నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి (నేతాజీ సర్కిల్), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు అందాలంటే రైతులు సాగు చేసిన ప్రతి పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తెలిపారు. బుధవారం రాయచోటి మండలంలోని ఎగువ అబ్బవరంలో పంట నమోదు కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా రాయచోటి అర్బన్ రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జ్‌ని పంట నమోదు ప్రక్రియ గురించి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలోని రైతులు అందరూ విధిగా పంట నమోదు చేసుకోవాలని, ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని రాయితీలకు పంట నమోదు ముఖ్యం అని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ, మండల వ్యవసాయ అధికారి రాజేంద్రప్రసాద్, బీఏపీ లక్ష్మి, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



## యువకుడిని బలి తీసుకున్న లోన్ యాప్

- రూ.5 వేలకే ప్రాణాలు పోగొట్టుకున్న వైనం



ముబారక్ (ఫైల్)

పీలేరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): లోను యాప్ నిర్వాహకుల వేధింపులను భరించలేక పాతికేళ్ల ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం పీలేరులో వెలుగు చూసింది. వ్యాపార అవసరాల నిమిత్తం చేసిన అప్పు సకాలంలో తీర్చలేకపోవడంతో ఆ యాప్ నిర్వాహకులు పంపిన అసభ్యకర మెసేజ్‌ల కారణంగా అతను బలవన్మరణానికి పాల్పడ్డాడు. పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ కథనం మేరకు పీలేరు పట్టణం కట్టుకాలువ వీధికి చెందిన ఎస్.ముబారక్ (25) స్థానిక కడప రోడ్డులో చికెన్ షాపు నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. వ్యాపార అవసరాల నిమిత్తం ఆన్‌లైన్‌లో ఆకర్షణీయమైన ప్రకటనలతో ఆకట్టుకున్న ఓ లోను యాప్‌లో రూ.5 వేలు అప్పు తీసుకున్నాడు. ఎటువంటి పత్రాలు అవసరం లేకపోవడం, త్వరగా రుణం అందుతుందన్న ఆశతో కేవలం ఏడు రోజుల వ్యవధిలో రూ.5 వేలకు వడ్డీ రూపంలో మరో రూ.4,850 చెల్లించేటట్లు ఒప్పందం చేసుకున్నాడు. ఇటీవల వ్యాపారాలు తగ్గిపోవడంతో సకాలంలో చెల్లించలేకపోయాడు. అప్పు వసూళ్ల ప్రక్రియలో భాగంగా ఆ యాప్ నిర్వాహకులు మంగళవారం మధ్యాహ్నం అతడి భార్య, సోదరుడు, మరికొంత మంది బంధువులకు అసభ్యకరమైన మెసేజ్‌లు పంపారు. ఆ మెసేజ్‌ల కారణంగా వారి కుటుంబంలో అలజడి రేగింది. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన ముబారక్ మంగళవారం మధ్యాహ్నం తన షాపులోనే పురుగుల మందు తాగాడు. దానిని గుర్తించిన సహచరులు ఈ విషయాన్ని అతని కుటుంబసభ్యులకు తెలియజేశారు. వారు అతనిని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రాణాలు వదిలాడు. చేసేది లేక వారు అతని మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి అతని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి దర్యాప్తు చేస్తున్నారు. ముబారక్ మరణించిన విషయం తెలుసుకున్న స్థానిక టీడీపీ నేతలు ఏఎంసీ ఛైర్మన్ పురం రామ్మూర్తి, కోటపల్లె బాబు రెడ్డి, అమరనాథ రెడ్డి, పోలిశెట్టి సురేంద్ర, షౌకత్ అలీ, చాన్ బాషా, ఫైరోజ్, అతని కుటుంబాన్ని పరామర్శించారు. లోన్ యాప్‌ల నిర్వాహకుల వేధింపుల గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం చేస్తామని వారికి ధైర్యం చెప్పారు.

## అప్రమత్తంగా ఉండండి

- రాజంపేట సబ్ కలెక్టర్ భావన
- పింఛా ప్రాజెక్టు నుంచి దిగువకు నీరు విడుదల


ప్రాజెక్టు, రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ భావన


పింఛా ప్రాజెక్టు గేట్ల నుంచి దిగువకు వెళుతున్న నీరు

సుండుపల్లె, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పింఛా ప్రాజెక్టు నుంచి గేట్ల ద్వారా దిగువకు నీరు విడుదల చేసిన సందర్భంగా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని రాజంపేట సబ్ కలెక్టర్ భావన తెలిపారు. బుధవారం ప్రాజెక్టు నుంచి 2500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. దీంతో ప్రాజెక్టును ఆమె పరిశీలించి అధికారులతో మాట్లాడారు. నది పరివాహక ప్రాంతంలోకి ప్రజలు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పల్లెల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని, కుంటలు, చెరువులు తెగే ప్రమాదం ఉంటే తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే నీరు అధికంగా ప్రవహించే ప్రాంతాల వద్ద రాకపోకలు జరగకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని తహసీల్దార్‌కు తెలిపారు. అనంతరం ప్రాజెక్టు గేట్లను తనిఖీ చేశారు. అధికారులు మండలంలోనే ఉండి ఏవైనా సమస్యలు ఏర్పడితే ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం చిన్నబిడికి వద్ద ప్రవహిస్తున్న నీటిని, రాయవరం దిగువ భాగంలో తెగిపోయిన మట్టి రోడ్డును పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్ చాంద్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేంద్రనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

## పీఎంఏజీవైకి మోక్షం

- ఎస్సీలుండే 33 ప్రాంతాల్లో మౌలిక వసతులకు ఖర్చు

కడపరూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆదర్శ్ గ్రామ యోజన (పీఎంఏజీవై) పథకానికి కూటమి పాలనలో గ్రహణం వీడింది. వైసీపీ పాలనలో గుర్తించిన పనులకు తాజాగా రూ.1,06,20,000 నిధులు మంజూరయ్యాయి. కడప జిల్లా రాజుపాలెం మండలంలోని ఏరువపాలెం పంచాయతీకి రూ.13 లక్షలు, వెల్లాల పంచాయతీకి రూ.6.10 లక్షలు, సిద్దవటం మండలంలోని జంగాలపల్లి పంచాయతీకి రూ.10 లక్షలు, నేకనాపురం పంచాయతీకి రూ.5 లక్షలు, ఎస్.రాజంపేట పంచాయతీకి రూ.15 లక్షలు ఖర్చు చేయనున్నారు. అలాగే కలసపాడు మండలంలోని పుల్లారెడ్డిపల్లి పంచాయతీకి రూ.15.05 లక్షలు, సింగరాయపల్లి పంచాయతీకి రూ.15.05 లక్షలు, కమలాపురం మండలంలోని రామచంద్రాపురం పంచాయతీకి రూ.6.50 లక్షలు, చదిపిరాళ్ల పంచాయతీకి రూ.2 లక్షలు, బద్వేలు మండలంలోని వీరాపల్లి పంచాయతీకి రూ.18.50 లక్షలు ఖర్చు చేయనున్నారు.

## నేటి నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

- జిల్లాలో తగ్గిన 9 వేల కార్డులు

కలికిరి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రేషన్ కార్డులను గురువారం నుంచి జిల్లాలో పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. బుధవారం దాదాపు అన్ని మండలాలకు కొత్త రేషన్ కార్డులు చేరుకున్నాయి. పంపిణీ చేసే బాధ్యతను స్థానిక చౌక దుకాణాల యజమానులకు అప్పగిస్తున్నారు. బయోమెట్రిక్ నమోదు ద్వారా కార్డులను ఆయా కుటుంబాలకు పంపిణీ చేయనున్నారు. కాగా మొత్తం మీద జిల్లాలో స్మార్ట్ రేషన్ కార్డులు 9,067 తగ్గాయి. ఈనెల వరకు మొత్తం జిల్లాలో 4,96,305 పాత కార్డులుండగా కొత్త కార్డులు 4,87,238 జారీ అవుతున్నాయి. మున్సిపాలిటీల వారీగా మదనపల్లెలో 62,983 కార్డులు మంజూరు కాగా రాయచోటికి 35,366, రాజంపేటకు 27,813 కార్డులు కేటాయించారు. నగర పంచాయతీ బి.కొత్తకోటకు 17,652 కొత్త కార్డులు కేటాయించగా రైల్వేకోడూరుకు 23,479, పీలేరుకు 21,009 వంతున కార్డులు మంజూరయ్యాయి. జిల్లాలో అత్యల్పంగా నందలూరు మండలానికి 9,719 కార్డులు కేటాయించారు. అక్టోబరు నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల ఆధారంగానే రేషన్ సరుకులు పంపిణీ చేయనున్నారు.

## మా ప్లాట్లను కాపాడండి

- వైసీపీ నేతలు కబ్జా చేస్తున్నారు...
- సబ్ కలెక్టర్‌కు బాధితుల వినతి



న్యాయం చేయాలని సబ్ కలెక్టరేట్ వద్ద మాట్లాడుతున్న సీనియర్ సిటిజన్స్

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భాగ్యనగర్ లేఅవుట్‌లో కంతుల చొప్పున సొమ్ము చెల్లించి ప్లాట్లు కొనుగోలు చేశాము, ఇప్పుడు వైసీపీ నేతలు మా ప్లాట్లను దౌర్జన్యంగా కబ్జా చేస్తున్నారని, మాకు న్యాయం చేయాలని సీనియర్ సిటిజెన్స్ సబ్‌కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. బుధవారం స్థానిక సబ్‌కలెక్టరేట్ వద్దకు సీనియర్ సిటిజెన్స్ వచ్చి తమ గోడు వెళ్లబోసుకున్నారు. వీరికి మద్దతుగా వచ్చిన జనసేన నేత రాయల్ గణి మాట్లాడుతూ పోతబోలు గ్రామం వద్ద భాగ్యనగర్ గ్రీన్‌సిటీ కింద వేసిన లేఅవుట్‌లో 99 మంది సీనియర్ సిటిజన్స్ ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసి రిజిస్టర్ చేసుకున్నారన్నారు. ఇటీవల వైసీపీ నేతలు నిజాముద్దీన్, కృష్ణప్ప, నాగరాజు, బాబాజాన్ వారి అనుచరులు ఆ స్థలాన్ని ఆక్రమించుకుని ప్లాట్లలో ఉన్న గుర్తు రాళ్లను తొలగించి దున్నేశారన్నారు. ఆ స్థలంలోకి సీనియర్ సిటిజన్స్ వెళ్లకుండా ఫెన్సింగ్ వేశారన్నారు. సీనియర్ సిటిజన్స్ మాట్లాడుతూ 25 ఏళ్లుగా తమ అధీనంలో ఉన్న ఇళ్ల స్థలాల్లో హైవే నిర్మాణం జరగడంతో కొందరికి నష్టపరిహారం వచ్చిందన్నారు. ఈ విషయమై తాము గత నెల సబ్‌కలెక్టర్‌కు పిర్యాదు చేయగా, వివాదాస్పద స్థలంలో తహసీల్దార్ ఆధ్వర్యంలో నోటీసు బోర్డు పెట్టారని, అయితే రెండు రోజులకే కబ్జాదారులు నోటీసు బోర్డు తొలగించేశారన్నారు. ఈ విషయాలపై సబ్‌కలెక్టర్ జోక్యం చేసుకుని సీనియర్ సిటిజన్స్‌కు న్యాయం చేయాలని కోరారు. అనంతరం సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జె.వరప్రసాద్, వై.రెడ్డిశాంతి, నరేంద్ర రాజు, లక్ష్మీదేవి, మోహన్‌బాబు, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దేరు సమీపంలో ఇసుక మాయం

- గతంలో అధికారులు సీజ్ చేశారు..
- నేడు అక్రమార్కులు దోచేశారు...


పెద్దేరు సమీపంలో నేడు ఇలా దర్శనమిస్తున్న సీజ్ చేసిన ఇసుక


పెద్దేరు సమీపంలో గతంలో అధికారులు సీజ్ చేసిన ఇసుక డంప్ (ఫైల్)


దిగువపల్లి సమీపంలో పెద్దేరు

పెద్దమండ్యం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువపల్లి పంచాయతీ పరిధిలోని పెద్దేరులో ఇసుక అక్రమ దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. ఇక్కడి నుంచి ఇసుకను స్థానికులతో పాటు తంబళ్లపల్లి, గాలివీడు, ఎన్‌పీ కుంట వాసులు కూడా అక్రమంగా తరలించినట్లు ఈ ప్రాంత వాసులు తెలిపారు. మూడు రోజుల క్రితం ఆంధ్రజ్యోతిలో 'పెద్దేరులో ఇసుక దందా' శీర్షికన కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. కాగా గత ఏడాది జూలై నెలలో పెద్దేరులో సమీపంలోని పెద్ద నల్లగుట్ట వద్ద 125 టన్నులు, పెద్దేరు ప్రాంతంలోనే మరోచోట 365 టన్నుల ఇసుక డంప్‌ను గుర్తించి రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. అయితే ప్రస్తుతం ఆ డంప్‌ను కూడా అక్రమార్కులు తరలించుకుపోయారు. రెండు రోజుల క్రితం అక్రమంగా ఇసుక తరలింపును దిగువపల్లి గ్రామస్థులు అడ్డుకుని రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు దాడులు చేసి రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీసులకు అప్పగించారు. అయినా అక్రమార్కులు ఆగకుండా పెద్దేరు పొడవునా భూములకు సమీపంలో ఉన్న ఇసుకను తరలించి అమ్మకాలు సాగిస్తున్నారని సమాచారం. అధికారులు దాడులు చేసి పెద్దేరులో అక్రమ ఇసుక తరలింపును అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# యూరియా వద్దు.. సేంద్రియమే ముద్దు

యూరియా యూరియా.. ఇప్పుడు రాష్ట్రంలో ఏ మూల చూసినా వింటున్న మాట ఇది. పంటలు సాగు చేసే రైతుల నుంచి విద్యార్థులు, సామాన్యులు కూడా యూరియాపై జోరుగా చర్చలు సాగిస్తున్నారు. పంటల సాగులో కొంత లాభం.. అధిక నష్టం ఇచ్చే యూరియా బదులు సేంద్రియ ఎరువులు వాడితే మంచిదే కదా అన్న మాటలు సర్వత్రా వినిపిస్తున్నాయి. జిల్లాలో జీరో బేస్డ్ నేచురల్ ఫార్మింగ్(జెడ్‌బీఎన్‌ఎఫ్) పథకం కింద ప్రభుత్వం సేంద్రియ ఎరువుల తయారీ, ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహకాలు ఇస్తున్న విషయాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

**సేంద్రియ ఎరువులతో తక్కువ ఖర్చు.. అధిక లాభాలు ● సేంద్రియ ఎరువుల వాడకానికి ప్రభుత్వ ప్రోత్సాహకాలు**

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మొక్కల ఎదుగుదలకు ప్రధాన పోషకపదార్థమైన నత్రజని ఎక్కువగా ఉండే రసాయన ఎరువు యూరియా. మొక్కల ఆకుపచ్చని భాగాలు, కాండాలు పెరుగుదలకు నత్రజని దోహదపడుతుంది. అలాంటి యూరియా ధర బస్తా (45 కిలోలు) సుమారు రూ.2వేలకు పైగా ఉంటుంది. కానీ కేంద్ర ప్రభుత్వం రైతులకు సబ్సిడీ ఇచ్చి కేవలం బస్తా యూరియా రూ.266కే పంపిణీ చేస్తోంది. యూరియాను పంటలకు తక్కువ మోతాదులోనే ఉపయోగించాల్సి ఉంది. కాని రైతులు ఎక్కువ దిగుబడులు వస్తాయని ఆశపడి మూడు రెట్లు అధికంగా యూరియా వాడుతున్నారు. తద్వారా యూరియాకు డిమాండ్ పెరగడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెరుగుతోంది.

**యూరియాతో లాభాలివీ..**

యూరియాలో 46శాతం నత్రజని ఉంటుంది. ఇతర రసాయన ఎరువులతో పోలిస్తే ఇందులో నత్రజని ఎక్కువ. మొక్కలకు త్వరితగతిన అందుబాటులోకి వచ్చి, తక్కువ మోతాదులో వాడినా మంచి ఫలితాలు వస్తాయి. యూరియా నీటిలో కరిగిపోయి మొక్కలకు త్వరగా అందుబాటులోకి వస్తుంది. ఇతర రసాయన ఎరువుల ధరలతో పోలిస్తే.. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీతో యూరియా ధరలు తక్కువే.



జీవామృతం తయారు చేస్తున్న రైతులు

**యూరియాతో నష్టాలివీ..**

యూరియాను పంట పొలాల్లో చల్లినప్పుడు సరైన పద్ధతిలో నీటిని పారించాలి. లేదంటే యూరియాలోని నత్రజని ఆవిరైపోయి అమ్మోనియా వాయువుగా మారుతుంది. యూరియాను అధిక మోతాదులో వాడటం వలన నేలలో ఆమ్లాల శాతం పెరిగి పంటసాగుకు పనికిరాకుండా పోతుంది. మొక్కల వేర్లను కాల్చివేస్తుంది. యూరియా భూగర్భజలాల్లో కలసి, నీటిని కలుషితం చేస్తుంది.

**సేంద్రియ ఎరువుల ఖర్చు ఇలా..**

ఒక ఎకరాలో వరిపంట సాగుకు పశువుల ఎరువు 2 ట్రాక్టర్లు (5 టన్నులు), కోళ్ల ఎరువు 2 టన్నులు, వేపపిండి 300 కిలోలు సరిపోతుంది. పశువుల ఎరువు రూ.6వేలు, వేపపిండి రూ.4వేలు, కోళ్ల ఎరువు రూ.4వేలు.. మొత్తం కలిపి ఎకరా వరిపంట సాగుకు రూ.14వేలు సేంద్రియ ఎరువులకు ఖర్చు చేస్తే సరిపోతోంది.

**రసాయన ఎరువుల ఖర్చు..**

ఎకరా వరిపంట సాగుకు యూరియా మూడు బస్తాలు, డీఏపీ 50 కిలోలు, పొటాషియం 50 కిలోలు, జింక్ సల్ఫేట్ 10 కిలోలు వాడాలి. ప్రస్తుతం మార్కెట్‌లో యూరియా బస్తా(45కిలోలు) రూ.266, డీఏపీ 50 కిలోలు రూ.1350, పొటాషియం 50 కిలోలు రూ.1650, జింక్ సల్ఫేట్ కిలో రూ.231 పలుకుతున్నాయి. నాలుగు ఎరువులు కలిపి ఎకరాకు రూ.6,108 అవుతుంది. కాని రైతులు మూడు రెట్లు అధికంగా రసాయన ఎరువులు వాడుతున్నారు. దీంతో వీరికి ఎకరా వరిపంట సాగుకు రూ.18 వేలు ఖర్చు వస్తోంది.

**సేంద్రియ ఎరువులతో లాభాలు**

పంటసాగులో సేంద్రియ ఎరువులు వాడితే మట్టిని సారవంతం చేస్తాయి. మట్టిలో ఉండే సూక్ష్మజీవుల వృద్ధికి దోహదపడతాయి. ఎన్ని పంటలు సాగు చేసినా మట్టి ఆరోగ్యంగా ఉంటుంది. సేంద్రియ ఎరువులు మట్టిలో నీటిని ఎక్కువసేపు పట్టి ఉంచేందుకు సహాయపడతాయి. దీంతో మొక్కలకు ఎక్కువసేపు నీరు అందుబాటులో ఉంటుంది. వీటితో సాగయ్యే పంటల నుంచి తయారయ్యే ఆహార పదార్థాలు రుచిగా ఉంటాయి. రసాయన అవశేషాలు వుండవు. సేంద్రియ ఎరువుల తయారీకి సహజ పదార్థాలనే వాడుతారు. దీని వలన పర్యావరణానికి ఎలాంటి హాని ఉండదు. వీటిని ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు. తద్వారా ఖర్చు తగ్గి రైతులకు ఆర్థికంగా లాభదాయకంగా ఉంటుంది.

**సేంద్రియానికి ప్రభుత్వ ప్రోత్సాహకాలు**

సేంద్రియ ఎరువుల తయారీరికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహకాలు అందిస్తున్నాయి. ఇందులో కేంద్ర ప్రభుత్వం పరంపరాగత్ కృషి వికాస్ యోజన, నేషనల్ ప్రాజెక్ట్ ఆన్ ఆర్గానిక్



ఫార్మింగ్, నేషనల్ మిషన్ ఆన్ సస్టైనబుల్ అగ్రికల్చర్ పథకాల ద్వారా రైతులకు పలు ప్రోత్సాహకాలు అందిస్తోంది. ఉపాధి హామీ పథకం కింద రైతులు వారి పొలాల్లో వర్మీ కంపోస్టు పిట్స్ నిర్మాణానికి ఆర్థిక సహాయం అందిస్తోంది. సేంద్రియ ఎరువుల తయారీకి, బయో ఫర్టిలైజర్ యూనిట్ల ఏర్పాటుకు ఆర్థిక సహాయం ఇస్తోంది.

**ఎక్కువ యూరియా వాడితే నష్టమే**



యూరియా కన్నా సేంద్రియ ఎరువుల్లోనే అధికశాతం సూక్ష్మపోషకాలు ఉంటాయి. యూరియా ఎక్కువ మోతాదులో వాడితే పంటకు నష్టమే. తక్కువ యూరియా వాడే రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.800 ప్రోత్సాహకం ఇస్తుంది. సేంద్రియ ఎరువులతో భూసారం పెరుగుతుంది. యూరియాతో భూములు బెట్టబారుతాయి.

- కె.నవీన్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ అధికారి, మదనపల్లె మండలం

## దైవిక వాస్తుశిల్పి విశ్వకర్మ: డీఆర్వో



విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న డీఆర్వో మధుసూదన్‌రావు

రాయచోటి నేతాజీసర్కిల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): దైవిక వాస్తుశిల్పి విశ్వకర్మను ఆదర్శంగా తీసుకుని చేతి, కుల వృత్తుల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని డీఆర్వో మధుసూదన్‌రావు తెలిపారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాల్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ విశ్వకర్మ ప్రోగ్రాంను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్టేట్ ప్రోగ్రాంగా ప్రకటించిందని తెలిపారు. హిందూ పురాణాల్లో కృష్ణుడు పరిపాలించిన ద్వారక నగరాన్ని, పాండవుల కోసం ఇంద్రప్రస్థలో రాజభవనాన్ని నిర్మించడంతో పాటు, దేవతలకు అద్భుతమైన ఆయుధాలను విశ్వకర్మ తయారు చేశాడని ప్రతీతి అన్నారు. కుల, చేతి వృత్తుల వారు ఆయనను భగవంతుడిగా భావిస్తుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి సురేశ్, కలెక్టరేట్ ఏవో నాగభూషణం, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్‌లు, సిబ్బంది, వివిధ చేతి, కులవృత్తుల సభ్యులు పాల్గొన్నారు.

## కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ ఆదర్శం

రాయచోటిటౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విశ్వకర్మ భగవానుడు కేవలం దేవతల శిల్పి మాత్రమే కాదని కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయుడని అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి తెలిపారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా బుధవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి పుష్పగుచ్ఛాలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ విశ్వకర్మను నిర్మాణ శాస్త్రానికి ఆద్యుడిగా భావిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఎం.శ్రీనివాసులు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు వీజే రామకృష్ణ, ఎం.పెద్దయ్య, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, ఇతర పోలీసు అధికారులు, డీపీవో సిబ్బంది నివాళులర్పించారు.

## రూ.5 కోట్లతో గురుకుల పాఠశాల భవనం



స్థల పరిశీలన చేస్తున్న గిరిజన సంక్షేమ శాఖ అధికారులు

పీలేరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం పీలేరులో నడుస్తున్న కేవీ పల్లె గిరిజన బాలికల రెసిడెన్షియల్ పాఠశాల కోసం రూ.5 కోట్లతో పక్కా భవనం నిర్మించనున్నట్లు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఈఈ కేవీఎస్‌ఎన్ కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన కేవీపల్లె మండలం సొరకాలయపేట పంచాయతీ బృందావనం వద్ద ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కేవీ పల్లె మండలానికి గిరిజన బాలికల గురుకులం మంజూరైనా సొంత భవన నిర్మాణానికి అనువైన స్థలం లేకపోవడంతో నిర్మాణ పనుల్లో జాప్యం జరిగిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం భవన నిర్మాణానికి స్థలం కేటాయించడమే కాకుండా రూ.5 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభించి 18 నెలల్లోపు పూర్తిచేస్తామన్నారు. కేవలం కేవీ పల్లెలోనే కాకుండా నెల్లూరు జిల్లా కావలిలో రూ.4.97 కోట్లు, తిరుపతి జిల్లా మంగళంలో రూ.3.25 కోట్లతో గిరిజన బాలికల గురుకులాల కోసం నూతన భవనాల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ ఈఈ ధనంజయ రెడ్డి, డీఈఈ మృణాళిని, ఏఈ జాన్, టీడీపీ నేత వగ్గ్ల చిన్నా, తదితరులు పాల్గొన్నారు.

## చేపలచెరువు వేలంపై డీఎల్‌డీఓ విచారణ



పెద్దతిప్పసముద్రం సెప్టెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): రంగ సముద్రం పెద్దచెరువు చేపల వేలం నిర్వహణ గత వైసీపీ ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా సాగిందంటూ రాపూరివాండ్లపల్లె యువకులు కొందరు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ మదనపల్లె డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీఎల్‌డీఓ)ను విచారణకు ఆదేశించారు. దీంతో బుధవారం డీఎల్‌డీఓ అమర్‌నాథ్‌రెడ్డి, ఈఓపీఆర్డీ మోహన్ ప్రతాప్‌తో కలిసి రాపూరివాండ్లపల్లెకు చేరుకుని క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. గతంలో చేపల చెరువు వేలం దక్కించుకున్న వారిని పిలిపించారు. వారితో పాటు ఫిర్యాదు దారులను పిలిపించి పలు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. వేలంలో పంచాయతీకి రావాల్సిన బకాయిలు తదితర వివరాలను పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదు దారునితో మాట్లాడి వారు చెప్పిన వివరాలను లిఖిత పూర్వకంగా నమోదుచేసి ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు తెలిపారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

### జిల్లా మలేరియా అధికారి మనోరమ

ఒంటిమిట్ట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మనోరమ సూచించారు. బుధవారం మండలంలోని చింతరాజుపల్లె హరిజనవాడ, గాండ్లపల్లె గ్రామాల్లో ఆమె పర్యటించి కీటకజనిత వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇంటింటికి తిరిగి లార్వా సర్వే, వైరల్ జ్వరాల సర్వే నిర్వహించారు. ఇక్కడి ప్రజలకు రక్త పరీక్షలు కూడా నిర్వహించి ఈ సందర్భంగా పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి భావనారెడ్డి, మలేరియా సబ్‌యూనిట్ అధికారి సుబ్బరాయుడు, సూపర్‌వైజర్‌లు భాస్కర్ రెడ్డి, లక్ష్మీనరసమ్మ, ఆరోగ్య కార్యకర్త కరీమున్నీషా, వెంకటసుబ్బయ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేటి నుంచి వీఆర్‌ఏల దశలవారీ ఉద్యమం

కలికిరి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా వీఆర్‌ఏల సమస్యల పరిష్కారం కోసం గురువారం నుంచి దశల వారీ ఉద్యమాన్ని మొదలు పెడుతున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు అల్లాబక్ష్, కార్యదర్శి రెడ్డెప్ప తెలిపారు. దీనికి సంబంధించిన కార్యాచరణ రాష్ట్ర సంఘం జిల్లా సంఘానికి అందజేసిందన్నారు. గురు, శుక్రవారాల్లో జిల్లాలోని అన్ని తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా, ఆందోళనలు చేపడతామన్నారు. చివరి రోజు తహశీల్దారుకు వినతి పత్రం అందజేస్తామన్నారు. 20వ తేదీన ఆర్డీఓ కార్యాలయాల వద్ద ధర్నా చేస్తామన్నారు. డివిజన్లలోని వీఆర్‌ఏ లందరూ తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు. 22న కలెక్టరు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. వీఆర్‌ఏలకు పే స్కేలు అమలు, నామినీల నియామకాలు, పదోన్నతులు, కారుణ్య నియామకాలు వంటి సమస్యలు దీర్ఘకాలంగా పరిష్కారం కాలేదని చెప్పారు.

## బస్సుకింద పడి మహిళ మృతి



షరీఫా మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ అనిల్‌కుమార్

కలికిరి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు వెనుక చక్రాల కిందపడి షరీఫా (46) అనేమహిళ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఇందిరమ్మ కాలనీ వాసులు షరీఫా, నూరుల్లా బుధవారం స్థానిక బ్యాంకులో పని ముగించుకుని తిరిగి కాలనీకి టీవీఎస్ మోపెడ్‌లో బయలుదేరారు. వెనుక వైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు వీరిని ఓవర్‌టేక్ చేసే క్రమంలో వెనుక చక్రం కింద మోపెడ్ అదుపు తప్పి పడిపోయింది. దీంతో చక్రాల కింద పడిన షరీఫా తీవ్ర గాయాలకు గురైంది. వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఇక బస్సు కింద పడిన మోపెడ్ నుజ్జునుజ్జయింది. వాహనాన్ని నడుపుతున్న నూరుల్లా తృటిలో తప్పించుకుని స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. సంఘటనా స్థలాన్ని, మృతదేహాన్ని సీఐ అనిల్‌కుమార్ పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



కారుకింద పడి నుజ్జునుజ్జు అయిన ద్విచక్ర వాహనం

రాయచోటి నేతాజీ సర్కిల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిలోని ఎస్. సోమవరం గ్రామం బాలయ్యగారిపల్లె క్రాస్‌రోడ్డు వద్ద ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... బుధవారం కలకడ మండలం బాలయ్యగారిపల్లెకు చెందిన భాస్కర్‌రెడ్డి (65) కలకడ సంతకు వచ్చి, ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి వెళ్తుండగా రాయచోటి వైపు నుంచి పీలేరు వైపు వెళ్తున్న కారు ఢీకొంది. దీంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ బాదుల్లా తెలిపారు.

## ఎర్రదుంగలు స్వాధీనం... ఇద్దరి అరెస్టు



పట్టుబడిన దుంగలు, స్మగ్లర్లతో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కోడూరు అటవీ రేంజ్ పరిధిలోని కేవీ బావి బీట్ అటవీ ప్రాంతంలో 10 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఆర్‌ఐ సాయి గిరిధర్ తెలిపారు. బుధవారం టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ ఎండీ షరీఫ్, ఏఆర్ ఎస్‌ఐ మహేశ్వర్ నాయుడు బృందం స్థానిక ఎఫ్‌బీవో నాగేశ్వర నాయక్‌తో కలిసి కూంబింగ్ నిర్వహిస్తుండగా నొక్కోడి గుండం వద్ద ఎర్రచందనం తరలిస్తున్న వ్యక్తులు తారసపడ్డారు. వారిపై దాడి చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకోగా, మిగిలిన వారు పారిపోయారు. పట్టుబడిన ఇద్దరూ తమిళనాడు రాష్ట్రానికి చెందిన వారుగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన 10 ఎర్రచందనం దుంగలతో సహా ఇద్దరు స్మగర్లను తిరుపతి టాస్క్‌పోర్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

## ప్రజావాణి సమస్యలకు పరిష్కారం చూపాలి



పెనగలూరు రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ ఆదర్శ రాజేంద్రన్

పెనగలూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో అందే సమస్యలను సత్వరం పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ సూచించారు. బుధవారం సాయంత్రం పెనగలూరు రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బందితో విడివిడిగా సమావేశమయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రజల నుంచి అందే అర్జీల పరిష్కారంపై సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చామన్నారు. సమావేశం అనంతరం కార్యాలయంలో ఉన్న సిబ్బంది విధులు నిర్వహించే గదులు, కంప్యూటర్ గది, రికార్డు గదులను తనిఖీ చేశారు. సమాచార హక్కు వివరాలు తెలిపే బోర్డు సక్రమంగా లేదని, ప్రజలకు కావాల్సిన సమాచారాన్ని సకాలంలో ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా వెన్నర్ల సాయికుమార్‌రెడ్డి జేసీని కోరారు. అందుకు స్పందించిన ఆయన ఈ సమస్యపై వస్తున్న ఫిర్యాదులు పరిష్కరించాలని తహశీల్దారును, డీటీని ఆదేశించారు. ఈ సమావేశంలో తహశీల్దారు అమరేశ్వరి, ఎంపీడీవో విజయరావు, డీటీ సుమని, ఆర్‌ఐ రామ్మోహన్, సర్వేయర్ ప్రభాకర్, వ్యవసాయాధికారి వీఎన్‌కే సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతలకు ప్రాధాన్యం ఇవ్వండి : డీజీపీ



డీజీపీకి బొకే అందజేస్తున్న ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

రాయచోటిటౌన్, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా నూతన ఎస్పీ ధీరజ్ కునుబిల్లి బుధవారం విజయవాడలోని డీజీపీ కార్యాలయంలో డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. నేరాల నివారణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులు, సురక్షితంగా ఉండే వాతావరణం కల్పించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కఠిన నిబంధనల అమలుతో పాటు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రజల్లో పోలీసులపై నమ్మకం పెంచేలా పారదర్శకంగా సేవలు అందించాలన్నారు. ఈ మేరకు జిల్లాలోని చట్ట వ్యవస్థలను బలోపేతం చేస్తామని, ప్రజలతో సులభంగా అందుబాటులో ఉండే పోలీసింగ్ కొనసాగిస్తామని ఎస్పీ అన్నారు.

## ఆర్టీసీ అద్దె బస్సు బోల్తా

● 11 మందికి స్వల్ప గాయాలు



బోల్తాపడిన బస్సును పరిశీలిస్తున్న ఆర్డీవోలు

ఒంటిమిట్ట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సిద్దవటం మండలం భాకరాపేట సమీపంలోని కల్వర్టు వద్ద ఆర్టీసీ అద్దె బస్సు బోల్తా పడడంతో అందులో ప్రయాణిస్తున్న డ్రైవర్, కండక్టర్ సహా 11 మందికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. బద్వేలు ఆర్టీసీ డిపోకు చెందిన అద్దె బస్సు బుధవారం ఉదయం కడపకు వెళుతూ భాకరాపేట సమీపంలోని కల్వర్టు వద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును తప్పించే యత్నంలో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ వెంటనారాయణ, కండక్టర్ శివయ్య, 9 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడినవారిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు.

కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, కడప, బద్వేలు ఆర్డీవోలు జాన్ ఎర్విన్, చంద్రమోహన్, బద్వేల్ ఆర్టీసీ డిపో మేనేజర్ నిరంజన్, సీఐ బాబు, బెటాలియన్ కమాండెంట్ ఆనంద్‌రెడ్డి, ఆర్ అండ్ బి ఏఈ రామాంజనేయులు, డిప్యూటీ తహశీల్దారు మాధవీలత, ఎస్‌ఐ మహమ్మద్‌రఫీ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. భాకరాపేట సమీపంలోని కల్వర్టుకు ఇరువైపులా రక్షణ గోడ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

## మద్యం దుకాణంలో చోరీ



దుకాణం పైకప్పును కత్తిరించిన దృశ్యం

గుర్రంకొండ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ పట్టణంలోని ఓ మద్యం దుకాణంలో మంగళవారం అర్ధరాత్రి మద్యం చోరీ జరిగింది. పట్టణంలోని నబీకాలనీలో మద్యం దుకాణాలను నిర్వహిస్తున్నారు. ఎప్పటిలాగే మంగళవారం రాత్రి నిర్వాహకులు మద్యం దుకాణాన్ని మూసేసి తాళం వేసుకుని వెళ్లారు. ఉదయం వచ్చేసరికి మద్యం దుకాణం వాకిలి తీసి చూడగా మద్యం బాటిళ్లు చిందర వందరగా పడివున్నాయి. దుకాణం పైకప్పునకు అమర్చిన రేకును దుండగులు కత్తరించి లోపలికి ప్రవేశించారు. దుకాణంలో కొన్ని మద్యం బాటిళ్లను తీసుకెళ్లినట్లు నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మద్యం దుకాణంలో చోరీ జరిగిన తీరును పరిశీలించి డాగ్ స్క్వాడ్‌ను పిలిపించి వివరాలను సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ రఘురాం తెలిపారు.

**మద్యంప్రియుల పనేనా...?**

పట్టణంలో మద్యం దుకాణంలో జరిగిన చోరీ మద్యం ప్రియులే చేసి ఉంటారని స్థానికులు, ప్రజలు చర్చించుకుంటున్నారు. చోరీ జరిగిన మద్యం దుకాణం పక్కన, వెనుకనే బెల్టు, సిట్టింగ్ రూములున్నాయి. మద్యం దుకాణం రాత్రి 10 గంటలకు మూసేస్తారు. బెల్టు, సిట్టింగ్ రూములు అర్ధరాత్రి వరకు తెరచి ఉండడంతో మందుబాబులతో కిటకిటలాడుతుంటాయి. ఈ క్రమంలో మద్యం దుకాణం గురించి పూర్తిగా తెలిసిన వ్యక్తులే చోరీకి పాల్పడి ఉంటారనేది ప్రజల వాదన. అంతేకాకుండా సిట్టింగ్ రూముతో మందుబాబుల ఆగడాలు అధికంగా ఉన్నట్లు చుట్టు పక్కల నివాసితులు వాపోతున్నారు. బెల్టు, సిట్టింగ్ రూములపై చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్‌శాఖ అధికారులకు పలుమార్లు తెలిపినా పట్టించుకోవడం లేదని మహిళలు ఆరోపిస్తున్నారు. ఇకనైనా బెల్టు, సిట్టింగ్ రూములను తొలగించాలని మహిళలు కోరుతున్నారు.




గుర్రంకొండలో చోరీ జరిగిన మద్యం దుకాణం

# మహిళలు ఆర్థిక శక్తిగా ఎదిగేందుకు..!

- చేయూతనిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- చిరు వ్యాపారులకు ప్రోత్సాహకాలు
- వ్యాపారాల కోసం రూ.2లక్షల వరకు సాయం

కడప ఎన్టీఆర్ సర్కిల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబంలో ఒక మహిళా పారిశ్రామికవేత్తను తయారు చేయాలనే విధంగా సీఎం చంద్రబాబు అధికారులకు ఇప్పటికే దిశ నిర్దేశం చేశారు. దీంతో జిల్లాలోని 35 మండలాల్లో పది వేల మందిని పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలనేది లక్ష్యం. కాగా ఇప్పటి వరకు 2,916 మందికి సంబంధించిన దరఖాస్తులను బ్యాంకులకు పంపారు. అందులో 2,828 మందికి రుణం అందించారు. మరో 88 మందికి సంబంధించిన దరఖాస్తులను బ్యాంకర్లు పరిశీలిస్తున్నారు. జిల్లాలో మహిళా పారిశ్రామికవేత్తలకు సంబంధించిన రుణాల మంజూరుపై గణాంకాలను పరిశీలిస్తే.. రాజుపాలెం, కొండాపురం, మైదుకూరు, ఎర్రగుంట్ల, పెద్దముడియం, వేంపల్లె, ఖాజీపేట, జమ్మలమడుగు, చింతకొమ్మదిన్నె, దువ్వూరు, వేముల, కమలాపురం మండలాల్లో యూనిట్ల స్థాపనలో మెరుగైన ఫలితాలు కనిపిస్తున్నాయి. ఇక ముద్దనూరు, సిద్దవటం, చెన్నూరు, గోపవరం, లింగాల, బి.కోడూరు, కాశినాయన, మైలవరం వల్లూరు, చాపాడు, పోరుమామిళ్ల, సింహాద్రిపురం, ఒంటిమిట్ట, పెండ్లిమర్రి మండలాల్లో సింగిల్ డిజిట్‌లో యూనిట్ల ఏర్పాటు జరిగింది. అట్లూరు, బద్వేలు, బి.మఠం, చక్రాయపేట, కలసపాడు, ప్రొద్దుటూరు, పులివెందుల, తొండూరు, వీఎన్‌పల్లె మండలాల్లో ఇప్పటి వరకు ఒక పరిశ్రమ కూడా ఏర్పాటు కాలేదు.

**ప్రత్యేక సర్వే....**

ఈ లక్ష్యసాధనలో భాగంగా క్షేత్రస్థాయిలో ప్రత్యేక సర్వేను చేపడతున్నారు. అధికారులు నేరుగా మహిళలు నిర్వహిస్తున్న పరిశ్రమల వద్దకు వెళ్లి వివరాలు సేకరించనున్నారు. వారు ఎలాంటి వ్యాపారం చేస్తున్నారు, ఎంత ఆదాయం పొందుతున్నారు. ఎంత మందికి ఉపాధి కల్పిస్తున్నారు. వంటి కీలక సమాచారాన్ని నమోదు చేసుకుంటారు. ఈ సమాచారం ఆధారంగా యూనిట్లను జీవనోపాధుల, ఎంటర్‌ప్రెన్యూర్, ఎంటర్‌ప్రైజెస్ అనే మూడు విభాగాలుగా వర్గీకరించి వాటి అభి వృద్ధికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేస్తారు. ఈ సర్వేలో గుర్తించిన అర్హులైన మహిళలకు తమ వ్యాపారాలను విస్తరించుకునేందుకు ప్రభుత్వం ఆర్థిక చేయూత అందించనుంది. బ్యాంకుల ద్వారా కనిష్ఠంగా రూ.10వేల నుంచి గరిష్ఠంగా రూ.2లక్షల వరకు రుణం మంజూరు చేయనున్నట్లు అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. అంతే కాకుండా స్త్రీనిధి పథకం ద్వారా రూ.లక్ష వరకు, ఎస్సీ ఎస్టీ ఉన్నతి పథకం కింద రూ.2లక్షల నుంచి అవసరాన్ని బట్టి రూ.10లక్షల వరకు కూడా రుణాలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే యూనిట్ విస్తరణకు రుణాలు పొందాలంటే ఆ వ్యాపారం ద్వారా కనీసం మరొకరికి ఉపాధి కల్పించాలనే నిబంధనలను పాటించాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం జిల్లాలో చాలా మంది మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా డెయిరీ, పచ్చళ్లు, ఆహారశుద్ధి, కలంకారి, పేపరు ప్లేట్లు వంటి చిన్నతరహా పరిశ్రమలను విజయవంతంగా నడుపుతున్నారు. ఈ యూనిట్ల వివరాలను, ఫొటో లను ప్రత్యేక యాప్‌లో నమోదు చేసి పారదర్శకత పాటిస్తున్నారు. ఈ పథకంపై మరింత సమాచారం కావాల్సిన వారు స్థానిక అధికారులను సంప్రదించాలని డీఆర్‌డీఏ అధికారులు సూచిస్తున్నారు.

**వచ్చే మహిళా దినోత్సవానికి వందలాది మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు పరిశ్రమలశాఖ, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ప్రత్యేక సర్వే చేపడుతున్నారు. స్త్రీనిధి, ఉన్నతి పథకాల కింద మహిళలకు అదనపు రుణాలు అందించి వారిని ఆర్థికంగా శక్తివంతులుగా తీర్చిదిద్దేందుకు ఒక బృహత్తర కార్యక్రమాన్ని చేపడుతున్నారు.**

### మహిళా పారిశ్రామికవేత్తలే లక్ష్యం



చిరు వ్యాపారాలు చేస్తున్న మహిళలను ప్రోత్సహించి ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగానే స్వయం సహాయక సంఘాల్లో సభ్యులై ఉండి వ్యాపారాలు మొదలుపెట్టిన మహిళలను గుర్తించి వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు సర్వేలు నిర్వహిస్తున్నాం. వారి అభిరుచులకు అనుగుణంగా వివిధ రంగాల్లో వ్యాపార విస్తరణకు చర్యలు తీసుకుంటున్నాం.

-డాక్టర్ జి.రాజ్యలక్ష్మి, పీడీ , డీఆర్‌డీఏ

### ఆర్థిక అభివృద్ధి వైపు అడుగులు



పెండ్లిమర్రి మండలం వెల్లటూరులోని మహిళల చేత అగరబత్తుల పరిశ్రమ నిర్వహించడం స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.

మహిళలు తమ గృహ పనులతో పాటు అగరబత్తుల పరిశ్రమను విజయవంతంగా నడిపిస్తూ కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగు పరుస్తున్నారు. ఈ చిన్న స్థాయి పరిశ్రమ ఇప్పుడు గ్రామంలోనే అనేక కుటుంబాలకు ఉపాధి అవకాశాలను కల్పిస్తోంది. ఇంటి ఆవరణలోనే పరిశ్ర మను నడుపుతూ అగరబత్తులు తయారు చేసి స్థానిక మార్కెట్‌లోకి తీసుకు వెళుతున్నారు. ఈ పరిశ్రమ వల్ల గ్రామంలోని మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యంతో పాటు సామాజిక గౌరవం కూడా దక్కుతోంది.



ఖాజీపేట మండలం కొత్తపేటలోని కూసాల కొట్టాలకు చెందిన నాగలక్ష్మమ్మ అనే గిరిజన మహిళ ఉన్నతి ద్వారా లక్ష రూపాయలు రుణం పొంది చీపుర్ల తయారీ పరిశ్రమను ఏర్పాటు చేశారు. మొదట ఈమె తన భర్త సుబ్బరాయుడుతో కలిసి కూలీ పనులకు వెళ్లేవారు. పనులు లేని కాలంలో పూట గడవడం కూడా కష్టంగా సాగేది. 2004లో పొదుపు సంఘంలో చేరారు. వెలుగు సిబ్బంది ప్రోత్సాహంతో కొంత మేర రుణం తీసుకుని చీపురు పుల్లల వ్యాపారం ప్రారంభించారు. తరువాత ఉన్నతి ద్వారా మరికొంత రుణాన్ని తీసుకుని వ్యాపారం అభివృద్ధి చేసుకున్నారు. చీపురు పుల్లలను ఏలూరు, విజయవాడ ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటు న్నారు, ఒక లోడుకు రూ.50వేల నుంచి మూడున్నర లక్షల వరకు ఖర్చు చేస్తున్నట్లు సుబ్బలక్షుమ్మ చెబు తున్నారు. ఇప్పుడు కూలీ పనులు మానేసి వ్యాపారం ద్వారా మెరుగైన జీవనో పాధిని పొందామని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## ఘనంగా విశ్వకర్మ మహర్షి జయంతి వేడుకలు



విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అదనపు ఎస్పీ

కడప క్రైం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భారతీయ పురాణాల్లో దేవశిల్పిగా వర్ణింపబడే విశ్వకర్మ మహర్షి విశిష్ట స్థానం కలిగిన రుషి అని, సమాజానికి కృషి, నైపుణ్యం, సాంకేతికత, ఆవిష్కరణలకు ప్రతీకగా నిలిచారని జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన) కె.ప్రకాశ్‌బాబు అన్నారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ చిత్రపటానికి అదనపు ఎస్పీ పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. భాద్రపద శుక్ల తృతీయ రోజు విశ్వకర్మ జయంతి జరుపుకుంటారని, కార్మికులు, శిల్పులు, ఇంజనీర్లు, మెకానిక్‌లు, సాంకేతికరంగానికి సంబంధించిన వారు విశ్వకర్మ ను తమ ప్రేరణగా భావించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని తెలిపా రు. అదనపు ఎస్పీ(ఏఆర్) బి.రమణయ్య మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక యుగంలో విశ్వకర్మ మహర్షి సిద్ధాంతాలు, సృజనాత్మకత, పట్టుదల, శ్రమించే తత్వాన్ని అలవరచుకుంటే ఎంత కష్టమైన పని అయినా తేలికగా సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు శివరాముడు, శ్రీశైల రెడ్డి, టైటస్, సోమశేఖర నాయక్, ఆర్‌ఎస్‌ఐలు, పోలీసు, డీపీవో సిబ్బంది పాల్గొన్నారు.

## డ్వాక్రా మహిళలకు పాడి పశువుల పంపిణీ

- డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి

కడప ఎన్టీఆర్ సర్కిల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలకు 12వేల పాడి పశువులను పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ రాజ్యలక్ష్మి తెలిపారు. స్థానిక పీజీఆర్‌ఎస్ భవనంలో డీఆర్‌డీఏ, పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడిపశువులను గ్రౌండింగ్ చేయడం కోసం గ్రామ, మండల స్థాయిలో లబ్ధిదారుల కు తగిన అవగాహన కల్పించాలని వెలుగు సిబ్బందికి సూచించారు. ప్రణాళికాబద్ధంగా ఈనెల 30 నాటికి గ్రౌండింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా వెలుగు ఏపీయంలతో వివిధ పథకాలపై సమీక్ష నిర్వహించారు. పశుసంవర్ధకశాఖ జేడీ శారదమ్మ మాట్లాడుతూ వెలుగు సిబ్బంది గ్రౌండింగ్ చేసే పాడి పశువులకు తమ శాఖపరిధిలోని డిప్యూటీ డైరెక్టర్లు, ఏడీలు మండలస్థాయిలో పశువైద్యులు వారి శాఖకు సంబంధించిన అనుబంధ పనులకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తారని తెలిపారు. ఎల్‌డీఎం జనార్ధన్ మాట్లాడుతూ వెలుగు సిబ్బందికి కావాల్సిన బ్యాంకు రుణాలు మంజూరు చేయడంలో జాప్యం జరగకుండా చూస్తామన్నారు. సమావేశంలో యూనియన్ బ్యాంకు ఆర్ఎం, పశు సంవర్ధకశాఖ డీడీలు, ఏడీలు, డీఆర్‌డీఏ ఏపీడీ, వెలుగు డీపీఎంలు, ఏపీయంలు హాజరయ్యారు.

## సచివాలయ సిబ్బందికి పీ-4 బాధ్యతలు

- అవగాహన సదస్సులో సీపీవో హజరత్తయ్య



పీ4 శిక్షణలో మాట్లాడుతున్న సీపీవో హజరత్తయ్య

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పేదల ఆర్థిక స్థితిగతులు మెరుగుపరిచి బంగారు కుటుంబాలుగా తీర్చే క్రమంలో సచివాలయ ఉద్యోగుల పాత్ర కీలకమని జిల్లా ప్రణాళికాధికారి హజరత్తయ్య పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సభాభవనంలో రాష్ట్ర ప్రభుత్వం పేదరిక నిర్మూలనకు తీసుకుంటున్న పీ4 పాలసీకి సంబంధించి సచివాలయ ఉద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీవో మాట్లాడుతూ పీ4 పథకం అమలులో పేదరికంతో ఉన్నవారిని బంగారు కుటుంబాలుగా, వారికి తోడ్పాటునందించే మార్గదర్శుల సమన్వయ బాధ్యతలను చేసుకోవాలన్నారు. బంగారు కుటుంబాలకు, మార్గదర్శులకు సమన్వయకర్తలుగా సచివాలయ ఉద్యోగులు కీలకపాత్ర పోషించి లక్ష్యాలను సాధించాలన్నారు. క్లస్టర్ వారీగా మార్గదర్శులు, బంగారు కుటుంబాలను విభజించి కార్యదర్శులకు బాధ్యతలను అప్పగించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ అధికారులు, సచివాలయపు సిబ్బంది పాల్గొన్నారు.

## పారా మెడికల్ డిప్లొమా కోర్సులకు దరఖాస్తులు

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేట్ కళా శాలల్లో పారా మెడికల్ రెండేళ్ల కోర్సులకు దరఖాస్తులు ఆహ్వా నిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు. ఈ మేరకు 2025-26 విద్యా సంవత్సరానికి సంబం ధించి రాష్ట్ర ప్రభుత్వ పారా మెడికల్ బోర్డు నోటిఫి కేషన్ విడుదల చేసిందన్నారు. ఈ కోర్సుల్లో ప్రవేశానికి ఇంటర్ పాసైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఎంపిక చేసిన విద్యార్థులకు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో శిక్షణ కోర్సులు ఇస్తారని తెలిపారు. దరఖాస్తు గడువు పెంచినందున ఆసక్తి గల విద్యార్థు లు ఈనెల 27 వతేదీ సాయంత్రం 5గంటల లోపు కడప డీఎంహె చ్‌వో కార్యాలయంలో అందజేయాలన్నారు.

## టెంకాయల వేలం వాయిదా

చక్రాయపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో బుధవారం నిర్వహించిన టెంకాయల వేలంపాట వాయిదా వేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ జె.వెంకటసుబ్బయ్య తెలిపారు. గత ఏడాది టెంకాయల వేలం రూ.80 లక్షలకు పలికిందన్నారు. ఈ ఏడాది రూ.80 లక్షల నుంచే వేలం పాట మొదలు పెట్టగా.. ఎవరు ముందుకు రాకపోవడతో వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శివయ్య, ప్రధాన అర్చకులు కేసరి, పోలీసు, బ్యాంకు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

## హార్టికల్చర్ డీడీగా సతీష్ బాధ్యతలు



బాధ్యతలు స్వీకరిస్తున్న సతీష్

కడప రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉద్యానశాఖ డిప్యూటీ డైరక్టర్ (డీడీ)గా జి.సతీష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఉద్యాన శాఖ సహాయ సంచాలకులుగా (ఏడీ)గా ఉంటూ పారిన్ సర్వీస్‌పై చిత్తూరు జిల్లా ఏపీఎంఐపీ పీడీగా పనిచేస్తున్న ఈయనకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉద్యానశాఖ డీడీగా పదోన్నతి కల్పించి వైఎస్ఆర్ కడప జిల్లాకు నియమించారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు.

## పీజీఆర్ఎస్ ఆడిట్ అంశాలపై సమీక్ష

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదలపై బుధవారం రాష్ట్రస్థాయి చీఫ్ కో ఆర్డినేటర్ చిన్నారావు జిల్లా రెవెన్యూ అధికారులతో వీసీ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్‌లోని వీసీ హాలులో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, జిల్లాకు సంబంధించి నోడల్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారావు మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధించి ఆడిట్ అంశాలపై ఆరా తీశారు. ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలన్నారు.

## డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ విద్యార్థులకు సీఓఏ అనుమతులు

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీకి చెందిన 2020-21, 2021-22, 2022-23 బ్యాచ్ విద్యార్థులకు కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (సీఓఏ) కోర్సు అనుమతులు, ఎన్‌రోల్‌మెంట్ నెంబర్లు మంజూరయ్యాయని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ విశ్వనాథ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు, ఉన్నత విద్యా ప్రధాన కార్యదర్శి కోన శశిధర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

## వర్షంతో రద్దయిన కర్నూలు - చిత్తూరు మ్యాచ్

- డ్రాగా ముగిసిన కడప -అనంతపురం మ్యాచ్

కడప స్పోర్ట్స్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య జరుగుతున్న ఏసీఏ సౌత్ జోన్ అండ్-23 మెన్స్ మల్టీడే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లో భాగంగా ఆటకు చివరి రోజు బుధవారం కర్నూలు, చిత్తూరు జట్ల మధ్య సాగిన మ్యాచ్ వర్షం కారణంగా తుడిచిపెట్టుకుపోయింది. కడప, అనంతపురం జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్ డ్రాగా ముగిసింది.

## పాఠశాల స్థల ఆక్రమణపై పరిశీలన



ఎస్ఎస్ఏ పీవోకు వివరిస్తున్న మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి

చెన్నూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపేట ప్రాథమిక పాఠశాలకు సంబంధించిన స్థలాన్ని ఆక్రమంగా రిజిస్టరు చేసుకుని విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నారంటూ ఆ గ్రామ మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి ఇటీవల మంత్రి నారా లోకేశ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం కడప సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్టు అధికారి నిత్యానందరాజు పరిశీలనకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల గదులను, పూర్వం పాఠశాల స్థల విస్తీర్ణం, ప్రస్తుతం ఎంత ఉంది, ఎంత ఆక్రమణకు గురైంది అన్న విషయాలపై కూలంకుషంగా పరిశీలించారు. అలాగే పాఠశాల చుట్టూ సచివాలయ సర్వేయరుతో కొలతలు వేయించి ఆ నివేదిక తీసుకున్నారు. అదే సమయంలో మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి పాఠశాల వద్దకు వచ్చి గతంలో ఇదే గ్రామానికి చెందిన దాత పది సెంట్ల స్థలాన్ని పాఠశాల నిర్మాణం కోసం ఇచ్చారన్నారు. అయితే ఇదే గ్రామానికి చెందిన మన్నె విజయభాస్కర్‌రెడ్డి, మన్నె విశ్వనాధరెడ్డి అనే వ్యక్తులు తప్పుడు డాక్యుమెంట్లతో ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారని ఆరోపించారు. ఇందుకు స్పందించిన పీడీ మాట్లాడుతూ పాఠశాల స్థల ఆక్రమణకు సంబంధించి నివేదికను ఆర్డీవోకు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ డీఈ సుధాకర్‌రెడ్డి, వీఆర్వో లక్ష్మీదేవి, సర్వేయరు రామచంద్ర, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పద్య పఠన పోటీల్లో వీరమల్లు గౌరికి రాష్ట్ర స్థాయి బహుమతి



బహుమతి సాధించిన గౌరితో ప్రిన్సిపాల్

మైదుకూరు రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వనిపెంట బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న వీరమల్లు గౌరి రాష్ట్రస్థాయి తెలుగు పద్య పఠన పోటీలలో ప్రథమ బహుమతి సాధించినట్లు ఆ పాఠశాల ప్రిన్స్‌పాల్ నిర్మల తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో గురుకుల పాఠశాల విద్యార్థులకు ఆన్ లైన్ ద్వారా నిర్వహించిన ఈ పోటీల్లో గౌరి మంచి ప్రతభ కనబరిచి మొదటి బహుమతి సాధించిందన్నారు. అలాగే మూడు భాషల్లో జిల్లా స్థాయిలో కూడా ప్రథమ స్థానం సాధించిందన్నారు. ఈ సందర్భంగా శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయురాలు ప్రత్యూష, గౌరి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

## స్త్రీశక్తి పథకం అద్భుతం

- ఆర్టీసీ కడప జోనల్ చైర్మన్ పూల నాగరాజు



కడప మారుతీనగర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన స్త్రీశక్తి పథకం అద్భుతమని ఆర్టీసీ కడప జోనల్ చైర్మన్ పూలనాగరాజు అన్నారు. స్త్రీశక్తి పథకం అమలు చేసి నెలరోజులు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం కడపలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం చేసేందుకు వీలుగా ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథకం వారి జీవితాల్లో వెలుగులు నింపుతోందన్నారు. ఈ పథకం దిగ్విజయం కావడానికి ఆర్టీసీ పైస్థాయి నుంచి కింది స్థాయి ఉద్యోగుల కృషి దాగి ఉందన్నారు. నెల రోజుల్లో కడప జోన్ పరిధిలో సుమారు 22 లక్షల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేసినట్లు వెల్లడించారు. దీంతో జోన్‌కు సుమా రు రూ.262 కోట్లు ఆదాయం రాగా.. ఇందులో రూ.82 కోట్లు జీరో టికెట్ కింద ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఇటీవల అనంతపురం జిల్లాలో జరిగిన సూపర్‌సిక్స్, సూపర్ హిట్ బహిరంగసభకు దాదాపు 3200 బస్సులు నడిపామన్నారు. దీంతో ఆర్టీసీకి మంచి ఆదాయం చేకూరిందన్నారు. ముఖ్యంగా కడప జోన్‌లో దాదాపు 500 బస్సులు అవసరమని, కండక్టర్లు, డ్రైవర్లు కొరత కూడా ఉందన్నారు. కార్యక్ర మంలో ఆర్టీసీ కడప రీజనల్ మేనేజరు గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## హత్య కేసులో మహిళకు జీవిత ఖైదు

రాజంపేట టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో ఓ మహిళకు జీవిత ఖైదు విధిస్తూ జిల్లా మూడవ అదనపు జడ్జి ప్రవీణ్‌కుమార్ తీర్పు నిచ్చారు. పట్టణ సీఐ నాగార్జున కథనం మేరకు వివరాలిలా... రాజంపేట పట్ట ణంలోని ఎర్రబల్లెలో నివాసం ఉంటున్న నర్రెడ్డి సుమిత్రమ్మను 2019 సంవత్స రంలో ఆమె వియ్యంకురాలు వెలిచెలమల ఇందిరమ్మ ఇంట్లో ఎవరూ లేని సమ యంలో హతమార్చి, ఇంట్లోని బంగారు సరుడు, డైమండ్ నెక్లెస్, ఒక జత చెవి కమ్మలు, వెండి దీపాలు దొంగలించి, ఇంట్లో దొంగలు పడి నగలు అపహరిం చడమే కాకుండా హత్య చేశారని నమ్మించింది. మృతురాలి కుమారుడు మహీ ధర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు అప్పటి పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యా ప్తు చేశారు. ఈ కేసు చార్జిషీట్‌లో ఐదుగురు నిందితులుండగా, ఇందిరమ్మ నేరం చేసినట్లు రుజువు కావడంతో ఆమెకు జీవిత ఖైదు, రూ.5వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

## యూరియా రాయితీ... రైతులను మోసం చేయడమే!

- ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి

కడప సెవెన్‌రోడ్స్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతాంగానికి అవసరమైనంత యూరియా సరఫరా చేయకుండా వాడకాన్ని తగ్గించుకుంటే రూ.800 రాయితీ ఇస్తామని ప్రభుత్వం ఊరించడం రైతులను వంచించడమే అని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో యూరియా వాడకం తగ్గిస్తే బస్తాకు రూ.800 రాయితీ ఇస్తామని చెప్పడం రైతులను మభ్యపెట్టడానికే అన్నారు. కేంద్రం నుంచి రూ.500 కోట్లు తీసుకొని రైతులకు యూరియా వాడకాన్ని తగ్గించుకోమని చెప్పడం దారుణమన్నారు. వ్యవసాయాభివృద్ధికి, ఆహార ధాన్యాల ఉత్పత్తికి కీలకమైన ఎరువులను అవసరమైనన్ని సరఫరా చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. క్యాన్సర్ రావడానికి అనేక కారణాలు ఉన్నాయని, యూరియా వాడకంతో వస్తుందని చెప్పడానికి ఎలాంటి ఆధారాలేవని, ఒకవేళ అదే నిజమైతే ఇంతకాలం ఎందుకు మౌనంగా ఉన్నారన్నారు. భవిష్యత్తులో ఎరువులకు ప్రభుత్వాలు నగదు బదిలీ విధానాన్ని తెచ్చే ప్రమాదం పట్ల అప్రమత్తంగా ఉండాలని రైతాంగానికి విజ్ఞప్తి చేశారు.

## బొలెరో క్యాంపర్ బోల్తా.. ఒకరు మృతి

చక్రాయపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరువు కాంప ల్లె వద్ద బొలెరో క్యాంపస్ బోల్తాపడిన ఘటనలో అజయ్ అనే కూలి మృతి చెందినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన మేరకు వివరా లిలా.. మండలంలోని గండికొవ్వూరు-కుమార్లకాల్వ వద్ద సీఆర్ కంపెనీకి చెందిన బ్రిడ్జి పనులు జరుగుతున్నాయి. ఈ పనుల కోసం యూపీ నుంచి కూలీలు వచ్చారు. నీటి కోసం వేంపల్లె వైపు వెళ్తున్న క్రమంలో చెరువు కాంపల్లె వద్ద క్యాంపర్ బోల్తాపడింది. ఈఘటనలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన పది మంది కూలీలకు గాయాలయ్యాయి. వీరిని వేంపల్లె ప్రభుత్వ ఆసుప త్రికి తరలించారు. అజయ్ అనే కూలి చికిత్స పొందుతూ మృతి చెందారు. మరో ఇద్దరి పరిస్థితి విషయంగా ఉన్నట్లు తెలిపారు. ప్రమా దస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# ప్రధాని నరేంద్రమోదీ ఆదర్శం

సుండుపల్లె, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): భారతదేశ ప్రధాని నరేంద్రమోదీని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పలువురు బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా రాయవరం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. దేశ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశంతో ప్రధాని స్వచ్ఛతపైన ప్రత్యేక దృష్టి సారించారని మండల బీజేపీ అధ్యక్షుడు రమణగౌడ్ తెలిపారు. దేశం కోసం, దేశ ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు పాటుపడుతున్న ప్రధానిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రధానికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నాగశంకర్, బీజేపీ సీనియర్ నాయకులు సుబ్బరాజు, భవానీప్రసాద్, పెంచలయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

**రైల్వేకోడూరు రూరల్ :** నియోజకవర్గ కన్వీనర్ గడ్డం చెంగల్ రాజు ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని శివాలయంలో పూజలు చేశారు. ఆవరణలో మొక్క నాటారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడు పంపిణీ చేశారు. అనంతరం టోల్ గేట్ వద్ద ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నరేంద్ర మోడీ చిత్రపటానికి పూలమాల వేసి క్షీరాభిషేకం చేశారు. ఆటో స్టాండ్ వద్ద పేదలకు అన్నదానం చేశారు.

**ఓబులవారిపల్లె :** పెద్దఓరంపాడులోని సిద్దేశ్వరస్వామి ఆలయంలో మండల అధ్యక్షులు ముక్కా రూపేష్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి గడ్డం చెంగల్‌రాజు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు

**రాయచోటి- నేతాజీ సర్కిల్ :** పట్టణంలోని కొత్తపేట బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు.

**పుల్లంపేట:** . మండల ఇన్‌చార్జి కమలాపురం మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో మోడీ ప్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. టీడీపీ నాయకురాలు ముక్కా వరలక్ష్మీ కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. ఎస్‌బీవీడీ సభ హైస్కూల్లో మొక్కలు నాటారు. పేద ప్రజలకు అన్నదానం చేశారు.



పుల్లంపేటలో మోదీ చిత్రపటాన్ని పాలతో అభిషేకిస్తున్న కూటమి నాయకులు

**రాజంపేట :** రాజంపేట మున్సిపల్ పారిశుధ్య కార్మికులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిలోకేష్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతుగుంట రమేష్‌నాయుడులు మాట్లాడుతూ ప్రధాని నరంద్రమోడికి పీతిపాత్రులైన పారిశుధ్య కార్మికులను సన్మానించడం తమ అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు.

## ప్రతిఒక్కరు బాధ్యతగా ప్రవర్తించాలి : ఏఎస్పీ



ఆటో కార్మికులకు సూచనలు చేస్తున్న ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్‌హెగ్డే

రాజంపేట టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట పట్టణంలో ట్రాపిక్ విపరీతంగా పెరిగిందని, ప్రతిఒక్కరు బాధ్యతగా నడుచుకుంటే ట్రాఫిక్‌ను నియంత్రించవచ్చునని ఏఎస్పీ మనోజ్ రామ్‌నాధ్‌హెగ్డే తెలిపారు. బుధవారం పట్టణ పోలీసుస్టేషన్ వద్ద ఆటోవాళ్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట పట్టణంలో రోడ్లు వెడల్పు తక్కువగా ఉంటాయని ఆటోలు ఎక్కువగా ఉండడంతో వారికి ఆటో స్టాండ్‌లు లేక పోవడం ఎక్కడంటే అక్కడ ఆపడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతు న్నాయని తెలిపారు. కావున ఎవరికి ఇబ్బంది లేకుండా ఉండే ప్రదేశాల్లో ఆటోలు నిలుపుకోవాలని మున్సిపాలిటి అధికారుల సమన్వయంతో పట్టణంలో ఆటో స్టాండు కోసం ప్రదేశాలను ఎంపిక చేశామన్నారు. అప్పటి వరకు బాధ్యతగా ఆటో కార్మికులు ప్రజలకు ఇబ్బంది లేకుండా నడుచుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ నాగార్జున, ఎస్‌ఐ వెంకటేశ్, సిబ్బంది, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

## కూలిన పాఠశాల ప్రహరీగోడ

చిట్వేలి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వర్షాల నేపథ్యంలో చిట్వేలిలోని జిల్లా పరిషత్ పాఠశాల ప్రహరీగోడ బుధవారం కూలిపోయింది. ఉదయం 7 గంటల ప్రాంతంలో ఈ సంఘటన చోటు చేసు కోవడంతో ఎవరికీ ఎలాంటి ప్రమాదం సంభవించ లేదు. ప్రధానోపాధ్యాయుడు దుర రాజు ఘటన స్థలాన్ని పరిశీలించి స్థానిక నేతలకు సమాచారం అందించారు. ఎమ్మెల్యే అరవ శ్రీధర్ డీఈవోకు విష యం తెలియజేశారు.

## ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి: ఎస్ఐ

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి అని ఎస్ఐ మహేష్ తెలిపారు. చిన్నఓరంపాడు పరిధిలో బుధవారం ఆయన వాహనాల తనిఖీలు నిర్వహిం చారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహనానికి సంబంధించిన పత్రాలు ఎప్పుడూ సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. అపరాధ రుసుంను ప్రభుత్వానికి జమ చేయాలని సూచించారు. అతివేగంతో వాహనాలపై వెళ్లి ప్రాణాలమీదకు తీసుకోరాదని సూచనలు చేశారు. ఈ కార్యక్రమాలకు సిబ్బందితో పాటు హైవే పెట్రోలింగ్ పోలీసులు పాల్గొన్నారు.

## 9న అబ్దుల్ ఖాదర్ జిలానీ గంధం ఉత్సవం

నందలూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లె జెండామాను వీధిలోని అబ్దుల్‌ఖాదర్ జిలానీ (మాబు సుబాని) దర్గాలో అక్టోబరు 9న గంధం ఉత్సవం నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ సభ్యులు తెలియజేశారు. ఈ సందర్భంగా బుధవారం వారు మాట్లాడుతూ 10న జెండా ఉత్సవం నిర్వహించాలని జెండామానువీధి ముస్లింలు మాబుసుభహాని కమిటీ సభ్యులు, నందలూరు చిన్న గురువులయ్య సయ్యద్ హైదర్‌హుస్సేని ఖరారు చేశారన్నారు.

# స్వస్థ్ నారీ.. సశక్త్ పరివార్ అభియాన్ మహిళలకు వరం

● డీఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మీనరసయ్య

రాయచోటిటౌన్, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న స్వస్థ్ నారి- సశక్త్ అభియాన్ ప్రచార సేవా కార్యక్రమాన్ని బుధవారం రాయచోటి పట్టణంలోని ఏరియా హాస్పిటల్‌లో జిల్లా ఆసుపత్రి సేవల సమన్వయ అధికారి డాక్టర్ ఆంజనేయులు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లక్ష్మీనరసయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళ ఆరోగ్యం బలపడితే కుటుంబం మొత్తం సంతోషంగా ఉంటుందన్నారు. తల్లి ఆరోగ్యంగా ఉంటే తన పిల్లలు ఆరోగ్యంగా పెరుగుతారన్నారు. మహిళా శక్తి సమాజ శక్తికి పునాది అవుతుందన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి జిల్లాలోని అన్ని గ్రామీణ, పట్టలణ ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు, ఏరియా హాస్పిటల్స్, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ నెల 17 నుంచి అక్టోబరు 2 వరకు ప్రత్యేక వైద్య శిబిరాలు వైద్య నిపుణులు, పారామెడికల్ సిబ్బంది ద్వారా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం స్టేట్ అబ్జర్వర్ శ్రీమధుకర్, డాక్టర్ సంధ్య, డాక్టర్ శివప్రతాప్ ప్రోగ్రామ్ నోడల్ ఆఫీసర్, ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ డేవిడ్ సుకుమార్, ఐసీడీఎస్ పీడీ హైమావతి, వైద్య ఆరోగ్య అధికారులు పాల్గొన్నారు.



స్వస్థ్ నారి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు

## సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం: యూటీఎఫ్



బైక్ ర్యాలీలో యూటీఎఫ్ నేతలు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం మాదిరే కూటమి ప్రభుత్వం కూడా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కే. సురేశ్‌కుమార్ విమర్శించారు. ఆర్థిక, విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ చేపట్టిన రణభేరి జాతా బుధవారం రాయచోటికి చేరుకుంది. ఈ సందర్భంగా రాయచోటి రింగు రోడ్డు నుండి శివాలయం, బంగ్లా సర్కిల్, ఆర్టీసీ బస్టాండు మీదుగా డీఐవో కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. యూటీఎఫ్ కార్యదర్శులు లక్ష్మీరాజా, జయచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి షేక్. జాబీర్, మోడల్‌స్కూల్ టీచర్ల కన్వీనర్ చంద్రశేఖర్‌లు ప్రసంగించారు.

## ప్రభుత్వ ఆసుపత్రికి ఈసీజీ యంత్రం విరాళం



పరికరాలను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్, బ్యాంకు మేనేజర్

రాజంపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట ఐడీబీఐ బ్రాంచ్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి ఈసీజీ యంత్రంతో పాటు ఎల్‌ఈడీ మెషీన్‌ను స్థానిక ప్రభుత్వాసుపత్రికి విరాళంగా అంద జేశారు. ఈ సందర్భంగా రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ పీవీ నాగేశ్వరరాజు, ఐడీబీఐ మేనేజర్ ఆ పరికరాలను ప్రారంభించారు. రూ.5 లక్షల విలువ చేసే ఈసీజీ మిషన్, ఎల్‌ఈడీ పరికరాలను విరాళంగా అందించిన ఐడీబీఐ అధికారులకు సూపరిండెంట్ డాక్టర్ వీపీ నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో ఉపాధ్యాయుడి హఠాన్మరణం



శ్రీధర్ రెడ్డి (ఫైల్)

చిన్నమండెం, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): మండలంలోని టీ. చాకిబండ జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా (ఎస్‌జీటీ)గా పనిచేస్తున్న శ్రీధర్‌రెడ్డి (55) బుధవారం ఉదయం విధి నిర్వహణలోనే మరణించారు. సంబేపల్లె మండలం మొటుకొల్లపల్లికి చెందిన శ్రీధర్ రెడ్డి చాకిబండ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. బుధవారం తరగతి గదిలో హఠాత్తుగా పడిపోవడంతో తోటి ఉపాధ్యాయులు ఆయనను ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలోనే మృతి చెందారు. ఆయనకు ఒక కుమారుడు ఉన్నాడు. మండలంలోని ఉపాధ్యాయులు ఈ సంఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## విద్యార్థుల్లో సేవాభావం పెంపొందించడమే లక్ష్యం



గైడ్ కెప్టెన్‌లకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నరసింహారెడ్డి

రాయచోటిటౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సేవా భావం పెంపొందించడమే స్కౌట్స్ అండ్ గైడ్స్ లక్ష్యమని జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో మూడు నెలల శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ప్రవేష్ సర్టిఫికెట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 262 పాఠశాలల్లో నిర్వహిస్తున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లలో దాదాపు 2500 మంది విద్యార్థులకు ఈ సర్టిఫికెట్లు ప్రదానం చేసినట్లు చెప్పారు. వీరికి మరొక ఆరు నెలల శిక్షణ అనంతరం మార్చిలో ప్రథమ సోపాన్ సమీక్ష నిర్వాహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్లు మహమ్మద్ ఇలియాస్, చంద్రశేఖర్, గైడ్ కెప్టెన్లు సుజాత, రాజేశ్వరి, డైట్ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## 'వలంటీర్ల వ్యవస్థ కొనసాగించాలి'

వీరబల్లి, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన వలంటీర్ల వ్యవస్థను ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా కొనసాగించాలంటూ గ్రామ, వార్డు వలంటీర్లు బుధవారం రాజంపేట శాసనసభ్యుడు ఆకేపాటి అమర్‌నాథ రెడ్డికి, స్థానిక ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వలంటీర్ల వ్యవస్థను రద్దు చేసిందన్నారు. ఎన్నికల ప్రచారంలో చంద్రబాబునాయుడు వలంటీరు వ్యవస్థను కొనసాగించడమే కాకుండా ఉద్యోగ భద్రత కూడా కల్పిస్తానని హామీ ఇచ్చారన్నారు. తిరిగి తమ వ్యవస్థను కొనసాగించాలని కోరారు.

## బాలిక కుటుంబానికి న్యాయం చేయాలి

రాయచోటిటౌన్, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఒక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ చేసి మృతికి కారణాలను తెలియజేయాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని పౌరహక్కుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డెయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. రవిశంకర్, జిల్లా సహాయ కార్యదర్శి ఎం. రవికుమార్ డిమాండ్ చేశారు. బుధవారం వారు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 15న సోమవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో బాలిక తల్లి తన పని ముగించుకుని ఇంటికి వచ్చి చూడగా బాలిక ఉరికి వేలాడుతూ కనిపిందన్నారు. బాలిక మృతిపై తమకు ఎటువంటి అనుమానం లేదని బాలిక తల్లి తెలిపిందన్నారు. బాలిక తల్లిదండ్రులతోపాటు, పోస్టుమార్టం నిర్వహించిన వైద్యులను విచారించిన అనంతరం బాలిక కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని కోరుతున్నామన్నారు.

# మండల సమావేశానికి అధికారులందరూ హాజరుకావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

వీరబల్లి, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సమావేశానికి అన్నిశాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్ నాథ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీవో సభాభవనంలో ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చే శారు. ఈ సందర్భంగా సర్వసభ్య సమావేశానికి అధికారులందరూ ఎందుకు హాజరు కావడం లేదని మండిపడ్డారు. హాజరుకాని వారిపై వెంటనే చర్యలు తీసుకునేలా చూస్తానని హెచ్చరించారు. కొంతమంది సమయపాలన పాటించకుండా ఇష్టారాజ్యంగా సమావేశా నికి హాజరు కావడం విడ్డూరంగా ఉందన్నారు. అనంతరం ఎంపీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో తాగు నీటి సమస్య లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కొంత మంది ప్రజాప్రతినిధులు స్కూల్ బిల్డింగ్‌లు, అంగన్వాడీ బిల్డింగ్‌లు పెచ్చులూడి నీరు కారుతున్నాయని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఆయాశాఖల అధికారులు వారి శాఖల అభివృద్ధిని వివరించారు. తహసీల్దార్ ఖాజాబీ, ఎంపీడీవో జవహర్‌బాబు, జెడ్పీటీసీ ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.



## అన్నమాచార్యలో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న వైస్ చైర్మన్ ఎల్లారెడ్డి

రాజంపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రక్తదాన్ అమృత్ మహోత్సవ్ 2.0లో భాగంగా అన్నమాచార్య యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్శిటీ వైస్ చైర్మన్ సి.ఎల్లారెడ్డి, వైస్ చాన్సలర్ ఈ సాయిబాబారెడ్డి, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానమని, సమాజంలో ప్రతిఒక్కరు రక్తదానం చేయాలన్నారు. రక్తదానం చేసేందుకు విద్యార్థులు క్యూలో నిల్చోవడం హర్షణీయమన్నారు. వందలాది మంది విద్యార్థులు ఆరోగ్య పరీక్షలు చేసుకుని స్వచ్ఛందంగా రక్తదానం చేశారన్నారు. రక్తదాన శిబిరం విజయవంతం కావడానికి కృషి చేసిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, వైద్య బృందానికి కళాశాల యాజమాన్యం వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

### ఐదో జాతీయ ఫార్మకో విజిలెన్స్ వారోత్సవాలు

స్థానిక అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో బుధవారం జాతీయ ఫార్మ కో విజిలెన్స్ వారోత్సవాలను ప్రిన్సిపాల్ డాక్టర్ స్వర్ణలత ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, వైస్ చాన్సలర్ ఈ సాయిబాబారెడ్డి ఎ మాట్లాడుతూ ఫార్మసిస్ట్ తయారు చేసే ఔషధాలతోనే రోగి పూర్తి ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. ప్రతిఒక్కరు శ్వాస ద్వారా పంపించే ఔషధాలపై దృష్టి సారించాలన్నారు. వారం రోజుల పాటు జరిగే కార్యక్రమాల్లో పాల్గొని కళాశాల నిర్వహించే పోటీల్లో విజేతలు కావాలని కోరారు. ఈ ఉత్సవాల నిర్వహణపై కళాశాల యాజమాన్యం కార్యదర్శి డాక్టర్ సి.గంగిరెడ్డి, కోశాధికారి అభిషేక్‌రెడ్డి, చైర్మన్ సి.రామచంద్రయ్య అభినందించారు.

## తహసీల్దారు కార్యాలయంలో జేసీ ఆకస్మిక తనిఖీ



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ఆదర్శ రాజేంద్రన్

చిట్వేలి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అన్నమయ్య జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ బుధవారం చిట్వేలి తహసీల్దారు కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రీసర్వే, ఈ పంట, స్వామిత్వ తదితర అంశాలపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. విధులను నిర్లక్ష్యం చేయకుండా బాధ్యతగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు, ఎంపీడీవో, వ్యవసాయాధికారులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 'మత్తు'తో జీవితాన్ని నాశనం చేసుకోవద్దు

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దని లక్కిరెడ్డిపల్లె సీఐ కొండారెడ్డి సూచించారు. బుధవారం స్థానిక శ్రీవెంకటేశ్వర జూనియర్ కళాశాలలో మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి ఇతర మత్తు పదార్థాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. సైబర్ నేరాల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. అనవసరమైన వెబ్‌సైట్లను ఓపెన్ చేయరాదని, ఎవరికీ ఓటీపీలను చెప్పరాదనితెలియజేశారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పకుండా ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాంమోహన్‌రెడ్డి, ఎస్ఐ రవీంద్రబాబు, అధ్యాపకులు సహదేవరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కృష్ణారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## పోషణ మాసోత్సవాలు ప్రారంభం

గాలివీడు, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, శిశువులు, చిన్నారుల పోషణపై మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సిబ్బంది తెలిపారు. బుధవారం గాలివీడు-1 పరిధిలో సూపర్‌వైజర్ శారదమ్మ, సోనీ, సుజాత ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి అక్టోబరు 16 వరకు ఈ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. చిన్నారులు, మహిళల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

## మాజీ సైనికుల కుటుంబాలకు అండగా ఉంటాం..

రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మాజీ సైనికుల కుటుంబాలకు అండగా ఉంటామని ఉమ్మడి కడప జిల్లా సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు డి.రమణయ్య తెలిపారు. బుధవారం కోడూరు పట్టణంలోని మామిడి కాయల యార్డు వద్ద మాజీ సైనికులు శ్రీనివాస రాజు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రవనికి జిల్లా సైనిక్ సంక్షేమ అధికారి భక్తవత్సల రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ సైనికుల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేసే సంక్షేమ పథకాలు, ప్రయోజనాలను వివరించారు. సైనికుల కుటుంబాల వితంతువులకు గుర్తింపు కార్డులు, పిల్లల చదువులకు సీపీపీ సర్టిఫికెట్లు, స్పర్శ్ పెన్షన్, వెబ్ యాప్‌పై అవగాహన కల్పించారు. లీగల్ సెల్ క్లినిక్ తరఫున పారా లీగల్ వలంటీర్లు న్యాయపరమైన సమస్యలకు సహాయం అందిస్తారన్నారు. న్యాయపరమైన సమస్యలు ఉంటే సంబంధిత డాక్యుమెంట్లతో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోడూరు నియోజకవర్గ మాజీ సైనికులు పాల్గొన్నారు.

## నేరాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలి

రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థికి నేరాలపై అవగాహన ఉండాలని రైల్వేకోడూరు సిఐ కే.హేమసుందర్ తెలిపారు. బుధవారం కోడూరు పట్టణంలోని ప్రభుత్వ హై స్కూల్‌లో విద్యార్థులకు యాంటీ డ్రగ్స్, సోషల్ మీడియాతో లాభాలు నష్టాలు, ట్రాఫిక్ రూల్స్, మహిళలపై దాడులుతదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎల్లప్పుడు పోలీసులు అందుబాటులో ఉంటారని మీ పరిధిలో జరిగే నేరాలపై తక్షణమే సమాచారం ఇవ్వాలని కోరారు.

## యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

నందలూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : యాజమాన్య పద్ధతులు పాటిస్తే వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించవచ్చునని రాజంపేట వ్యవసాయ సంచాలకులు శివశంకర్ తెలిసారు. బుధవారం మండలంలోని పొత్తపి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన వరి సాగులో మెళవకులను వివరించారు. మండల వ్యవసాయా ధికారి మల్లికార్జున వరిలో ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. కడప వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త పి.శ్రీవల్లి మాట్లాడుతూ ముంపునకు గురైన పొలాల్లో నీరు తగ్గిన తర్వాత ఆజాక్సిస్ట్రోబిన్ ప్లస్ టేబుకోనజల్ 1.5 మి.లీ., 13.0.45.10 గ్రామ్స్ ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. పంటను ఆశించే తెగుళ్ల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు భరత్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## కనకదాసు విగ్రహావిష్కరణ జయప్రదం చేయండి

రాయచోటి - నేతాజీ సర్కిల్, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో అక్టోబరు 5న నిర్వహించనున్న భక్త కనకదాస విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం విజయవంతం చేయాలని అన్నమయ్య జిల్లా కురుబ సంఘం అధ్యక్షుడు, న్యాయవాది కందుకూరి ఈశ్వరయ్య బుధ వారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితను విమర్శించే స్థాయి రాష్ట్ర కురబ సంఘం అధ్యక్షుడిగా ప్రచారం చేసుకుంటున్న జబ్బల శ్రీనివాస్‌కు లేదని తెలిపారు. మంత్రి సవిత తన తండ్రి రామచంద్ర జ్ఞాపకార్థం కురుబ కులస్తుల ఆరాధ్య దైవం భక్త కనకదాస విగ్రహాన్ని అందజేసినట్లు తెలియజేశారు. తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల కురబ కులస్తులు ఈ కార్యక్రమాన్ని పండుగలా జరుపుకోవాలని తెలిపారు.

## పిల్లలకు పోషకాహారం అందించాలి

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): పిల్లల ఎదుగుదలకు మంచిపోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని అంగన్వాడీ సూపర్‌వైజర్ రూపలక్ష్మి తెలిపారు. పోషిత భారత్.. సాక్ష్యం భారత్‌లో భాగంగా బుధవారం దిన్నెపాడు అంగన్వాడీ కేంద్రంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 7వ నెల నుంచి పిల్లలకు అదనపు ఆహారాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

పుల్లంపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వత్తలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో గుండ్రాతి ఫౌండేషన్ అండ్ ట్రస్టీజ్ ఆధ్వర్యంలో బుధవారం మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. గత యేడాది పదో తరగతిలో మెరిట్ సాధించిన విద్యార్థులకు రూ.5 వేలు, 3 వేలు 2 వేలు చొప్పున అందజేశారు. గతంలో ప్రధానోపాధ్యాయునిగా పనిచేసిన కీ.శే. గుండ్రాతి రామ్మోహన్‌రాజు వర్థంతి సందర్భంగా ఆయనకు కుమారులు రాజంపేట ట్రాన్స్‌పోర్ట్ డీఈ శశిధర్‌రాజు, ఎస్వీఈఆర్డీ ప్రొఫెసర్ భానుమూర్తిరాజు, పుల్లంపేట ఎంఈవో చక్రధర్ చేతులమీదుగా ఈ కార్యక్రమం నిర్వహించారురు. రాజంపేట ఎంఈవో సుబ్బరాయుడు విద్యార్థులకు తనవంతుగా నగదు ప్రోత్సాహకాలు అందించారు. .

## ఆర్ఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ప్రశాంత్

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో జరిగిన ఆర్ఎస్‌యూ 10వ రాష్ట్ర మహాసభల్లో ఉమ్మడి కడప జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గం పుల్లంపేట మండలం అనంతసముద్రం గ్రామానికి చెందిన తొండంనాటి ప్రశాంత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. మూడు రోజుల పాటు జరిగిన మహాసభల్లో విద్యార్థి ప్రదర్శనలు, ప్రతినిధుల సభ, భవిష్యత్తు కార్యాచరణ రూపకల్పన జరిగింది. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ భవిష్యత్తులో ప్రభుత్వ విద్య రక్షణకై, నిరుద్యోగ సమస్యల పరిష్కారానికై పోరాటాన్ని కొనసాగిస్తానన్నారు.

# యూరియా వద్దు.. సేంద్రియమే ముద్దు

యూరియా యూరియా.. ఇప్పుడు రాష్ట్రంలో ఏ మూల చూసినా వింటున్న మాట ఇది. పంటలు సాగు చేసే రైతుల నుంచి విద్యార్థులు, సామాన్యులు కూడా యూరియాపై జోరుగా చర్చలు సాగిస్తున్నారు. పంటల సాగులో కొంత లాభం.. అధిక నష్టం ఇచ్చే యూరియా బదులు సేంద్రియ ఎరువులు వాడితే మంచిదే కదా అన్న మాటలు సర్వత్రా వినిపిస్తున్నాయి. జిల్లాలో జీరో బేస్డ్ నేచురల్ ఫార్మింగ్(జెడ్‌బీఎన్‌ఎఫ్) పథకం కింద ప్రభుత్వం సేంద్రియ ఎరువుల తయారీ, ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహకాలు ఇస్తున్న విషయాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

**సేంద్రియ ఎరువులతో తక్కువ ఖర్చు.. అధిక లాభాలు ● సేంద్రియ ఎరువుల వాడకానికి ప్రభుత్వ ప్రోత్సాహకాలు**

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మొక్కల ఎదుగుదలకు ప్రధాన పోషకపదార్థమైన నత్రజని ఎక్కువగా ఉండే రసాయన ఎరువు యూరియా. మొక్కల ఆకుపచ్చని భాగాలు, కాండాలు పెరుగుదలకు నత్రజని దోహదపడుతుంది. అలాంటి యూరియా ధర బస్తా (45 కిలోలు) సుమారు రూ.2వేలకు పైగా ఉంటుంది. కానీ కేంద్ర ప్రభుత్వం రైతులకు సబ్సిడీ ఇచ్చి కేవలం బస్తా యూరియా రూ.266కే పంపిణీ చేస్తోంది. యూరియాను పంటలకు తక్కువ మోతాదులోనే ఉపయోగించాల్సి ఉంది. కాని రైతులు ఎక్కువ దిగుబడులు వస్తాయని ఆశపడి మూడు రెట్లు అధికంగా యూరియా వాడుతున్నారు. తద్వారా యూరియాకు డిమాండ్ పెరగడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెరుగుతోంది.

### యూరియాతో లాభాలివీ..

యూరియాలో 46శాతం నత్రజని ఉంటుంది. ఇతర రసాయన ఎరువులతో పోలిస్తే ఇందులో నత్రజని ఎక్కువ. మొక్కలకు త్వరితగతిన అందుబాటులోకి వచ్చి, తక్కువ మోతాదులో వాడినా మంచి ఫలితాలు వస్తాయి. యూరియా నీటిలో కరిగిపోయి మొక్కలకు త్వరగా అందుబాటులోకి వస్తుంది. ఇతర రసాయన ఎరువుల ధరలతో పోలిస్తే.. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీతో యూరియా ధరలు తక్కువే.

### యూరియాతో నష్టాలివీ..

యూరియాను పంట పొలాల్లో చల్లినప్పుడు సరైన పద్ధతిలో నీటిని పారించాలి. లేదంటే యూరియాలోని నత్రజని ఆవిరైపోయి అమ్మోనియా వాయువుగా మారుతుంది. యూరియాను అధిక మోతాదులో వాడటం వలన నేలలో ఆమ్లాల శాతం పెరిగి పంటసాగుకు పనికిరాకుండా పోతుంది. మొక్కల వేర్లను కాల్చివేస్తుంది. యూరియా భూగర్భజలాల్లో కలసి, నీటిని కలుషితం చేస్తుంది.


జీవామృతం తయారు చేస్తున్న రైతులు

### సేంద్రియ ఎరువుల ఖర్చు ఇలా..

ఒక ఎకరాలో వరిపంట సాగుకు పశువుల ఎరువు 2 ట్రాక్టర్లు (5 టన్నులు), కోళ్ల ఎరువు 2 టన్నులు, వేపపిండి 300 కిలోలు సరిపోతుంది. పశువుల ఎరువు రూ.6వేలు, వేపపిండి రూ.4వేలు, కోళ్ల ఎరువు రూ.4వేలు.. మొత్తం కలిపి ఎకరా వరిపంట సాగుకు రూ.14వేలు సేంద్రియ ఎరువులకు ఖర్చు చేస్తే సరిపోతోంది.

### రసాయన ఎరువుల ఖర్చు..

ఎకరా వరిపంట సాగుకు యూరియా మూడు బస్తాలు, డీఏపీ 50 కిలోలు, పొటాషియం 50 కిలోలు, జింక్ సల్ఫేట్ 10 కిలోలు వాడాలి. ప్రస్తుతం మార్కెట్‌లో యూరియా బస్తా(45కిలోలు) రూ.266, డీఏపీ 50 కిలోలు రూ.1350, పొటాషియం 50 కిలోలు రూ.1650, జింక్ సల్ఫేట్ కిలో రూ.231 పలుకుతున్నాయి. నాలుగు ఎరువులు కలిపి ఎకరాకు రూ.6,108 అవుతుంది. కాని రైతులు మూడు రెట్లు అధికంగా రసాయన ఎరువులు వాడుతున్నారు. దీంతో వీరికి ఎకరా వరిపంట సాగుకు రూ.18 వేలు ఖర్చు వస్తోంది.

### సేంద్రియ ఎరువులతో లాభాలు

పంటసాగులో సేంద్రియ ఎరువులు వాడితే మట్టిని సారవంతం చేస్తాయి. మట్టిలో ఉండే సూక్ష్మజీవుల వృద్ధికి దోహదపడతాయి. ఎన్ని పంటలు సాగు చేసినా మట్టి ఆరోగ్యంగా ఉంటుంది. సేంద్రియ ఎరువులు మట్టిలో నీటిని ఎక్కువసేపు పట్టి ఉంచేందుకు సహాయపడతాయి. దీంతో మొక్కలకు ఎక్కువసేపు నీరు అందుబాటులో ఉంటుంది. వీటితో సాగయ్యే పంటల నుంచి తయారయ్యే ఆహార పదార్థాలు రుచిగా ఉంటాయి. రసాయన అవశేషాలు వుండవు. సేంద్రియ ఎరువుల తయారీకి సహజ పదార్థాలనే వాడుతారు. దీని వలన పర్యావరణానికి ఎలాంటి హాని ఉండదు. వీటిని ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు. తద్వారా ఖర్చు తగ్గి రైతులకు ఆర్థికంగా లాభదాయకంగా ఉంటుంది.

### సేంద్రియానికి ప్రభుత్వ ప్రోత్సాహకాలు

సేంద్రియ ఎరువుల తయారీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహకాలు అందిస్తున్నాయి. ఇందులో కేంద్ర ప్రభుత్వం పరంపరాగత్ కృషి వికాస్ యోజన, నేషనల్ ప్రాజెక్ట్ ఆన్ ఆర్గానిక్



ఫార్మింగ్, నేషనల్ మిషన్ ఆన్ సస్టైనబుల్ అగ్రికల్చర్ పథకాల ద్వారా రైతులకు పలు ప్రోత్సాహకాలు అందిస్తోంది. ఉపాధి హామీ పథకం కింద రైతులు వారి పొలాల్లో వర్మీ కంపోస్టు పిట్స్ నిర్మాణానికి ఆర్థిక సహాయం అందిస్తోంది. సేంద్రియ ఎరువుల తయారీకి, బయో ఫర్టిలైజర్ యూనిట్ల ఏర్పాటుకు ఆర్థిక సహాయం ఇస్తోంది.

### ఎక్కువ యూరియా వాడితే నష్టమే



యూరియా కన్నా సేంద్రియ ఎరువుల్లోనే అధికశాతం సూక్ష్మపోషకాలు ఉంటాయి. యూరియా ఎక్కువ మోతాదులో వాడితే పంటకు నష్టమే. తక్కువ యూరియా వాడే రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.800 ప్రోత్సాహకం ఇస్తుంది. సేంద్రియ ఎరువులతో భూసారం పెరుగుతుంది. యూరియాతో భూములు బెట్టబారుతాయి.

**- కె.నవీన్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ అధికారి, మదనపల్లె మండలం**

## దైవిక వాస్తుశిల్పి విశ్వకర్మ: డీఆర్వో


విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న డీఆర్వో మధుసూదన్‌రావు

రాయచోటి నేతాజీసర్కిల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): దైవిక వాస్తుశిల్పి విశ్వకర్మను ఆదర్శంగా తీసుకుని చేతి, కుల వృత్తుల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని డీఆర్వో మధుసూదన్‌రావు తెలిపారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాల్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ విశ్వకర్మ ప్రోగ్రాంను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్టేట్ ప్రోగ్రాంగా ప్రకటించిందని తెలిపారు. హిందూ పురాణాల్లో కృష్ణుడు పరిపాలించిన ద్వారక నగరాన్ని, పాండవుల కోసం ఇంద్రప్రస్థలో రాజభవనాన్ని నిర్మించడంతో పాటు, దేవతలకు అద్భుతమైన ఆయుధాలను విశ్వకర్త తయారు చేశాడని ప్రతీతి అన్నారు. కుల, చేతి వృత్తుల వారు ఆయనను భగవంతుడిగా భావిస్తుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి సురేశ్, కలెక్టరేట్ ఏవో నాగభూషణం, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్‌లు, సిబ్బంది, వివిధ చేతి, కులవృత్తుల సభ్యులు పాల్గొన్నారు.

## కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ ఆదర్శం

రాయచోటిటౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విశ్వకర్మ భగవానుడు కేవలం దేవతల శిల్పి మాత్రమే కాదని కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయుడని అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి తెలిపారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా బుధవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి పుష్పగుచ్ఛాలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ విశ్వకర్మను నిర్మాణ శాస్త్రానికి ఆద్యుడిగా భావిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఎం.శ్రీనివాసులు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు వీజే రామకృష్ణ, ఎం.పెద్దయ్య, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, డీపీవో సిబ్బంది నివాళులర్పించారు.

## రూ.5 కోట్లతో గురుకుల పాఠశాల భవనం

స్థల పరిశీలన చేస్తున్న గిరిజన సంక్షేమ శాఖ అధికారులు


పీలేరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం పీలేరులో నడుస్తున్న కేవీ పల్లె గిరిజన బాలికల రెసిడెన్షియల్ పాఠశాల కోసం రూ.5 కోట్లతో పక్కా భవనం నిర్మించనన్నట్లు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఈఈ కేవీఎస్ఎన్ కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన కేవీపల్లె మండలం సొరకాలయపేట పంచాయతీ బృందావనం వద్ద ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కేవీ పల్లె మండలానికి గిరిజన బాలికల గురుకులం మంజూరైనా సొంత భవన నిర్మాణానికి అనువైన స్థలం లేకపోవడంతో నిర్మాణ పనుల్లో జాప్యం జరిగిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం భవన నిర్మాణానికి స్థలం కేటాయించడమే కాకుండా రూ.5 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభించి 18 నెలల్లోపు పూర్తిచేస్తామన్నారు. కేవలం కేవీ పల్లెలోనే కాకుండా నెల్లూరు జిల్లా కావలిలో రూ.4.97 కోట్లు, తిరుపతి జిల్లా మంగళంలో రూ.3.25 కోట్లతో గిరిజన బాలికల గురుకులాల కోసం నూతన భవనాల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ ఈఈ ధనంజయ రెడ్డి, డీఈఈ మృణాళిని, ఏఈ జాన్, టీడీపీ నేత వగళ్ల చిన్నా, తదితరులు పాల్గొన్నారు.

## చేపలచెరువు వేలంపై డీఎల్‌డీఓ విచారణ



పెద్దతిప్పసముద్రం సెప్టెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): రంగసముద్రం పెద్దచెరువు చేపల వేలం నిర్వహణ గత వైసీపీ ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా సాగిం దంటూ రాపూరి వాండ్లపల్లె యువకులు కొందరు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ మదనపల్లె డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీఎల్‌డీఓ)ను విచారణకు ఆదేశించారు. దీంతో బుధవారం డీఎల్‌డీఓ అమర్‌నాథ్‌రెడ్డి, ఈఓపీఆర్డీ మోహన్ ప్రతాప్‌తో కలిసి రాపూరివాండ్లపల్లెకు చేరుకుని క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. గతంలో చేపల చెరువు వేలం దక్కించుకున్న వారిని పిలిపించారు. వారితో పాటు ఫిర్యాదు దారులను పిలిపించి పలు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. వేలంలో పంచాయతీకి రావాల్సిన బకాయిలు తదితర వివరాలను పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదు దారునితో మాట్లాడి వారు చెప్పిన వివరాలను లిఖిత పూర్వకంగా నమోదుచేసి ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు తెలిపారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

### జిల్లా మలేరియా అధికారి మనోరమ

ఒంటిమిట్ట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మనోరమ సూచించారు. బుధవారం మండలంలోని చింతరాజుపల్లె హరిజనవాడ, గాండ్లపల్లె గ్రామాల్లో ఆమె పర్యటించి కీటకజనిత వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇంటింటికి తిరిగి లార్వా సర్వే, వైరల్ జ్వరాల సర్వే నిర్వహించారు. ఇక్కడి ప్రజలకు రక్త పరీక్షలు కూడా నిర్వహించి ఈ సందర్భంగా పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి భావనారెడ్డి, మలేరియా సబ్‌యూనిట్ అధికారి సుబ్బరాయుడు, సూపర్‌వైజర్‌లు భాస్కర్ రెడ్డి, లక్ష్మీనరసమ్మ, ఆరోగ్య కార్యకర్త కరీమున్నీషా, వెంకటసుబ్బయ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేటి నుంచి వీఆర్‌ఏల దశలవారీ ఉద్యమం

కలికిరి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా వీఆర్‌ఏల సమస్యల పరిష్కారం కోసం గురువారం నుంచి దశల వారీ ఉద్యమాన్ని మొదలు పెడుతున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు అల్లాబక్ష్, కార్యదర్శి రెడ్డెప్ప తెలిపారు. దీనికి సంబంధించిన కార్యాచరణ రాష్ట్ర సంఘం జిల్లా సంఘానికి అందజేసిందన్నారు. గురు, శుక్రవారాల్లో జిల్లాలోని అన్ని తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా, ఆందోళనలు చేపడతామన్నారు. చివరి రోజు తహశీల్దారుకు వినతి పత్రం అందజేస్తామన్నారు. 20వ తేదీన ఆర్డీఓ కార్యాలయాల వద్ద ధర్నా చేస్తామన్నారు. డివిజన్లలోని వీఆర్‌ఏ లందరూ తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు. 22న కలెక్టరు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. వీఆర్‌ఏలకు పే స్కేలు అమలు, నామినీల నియామకాలు, పదోన్నతులు, కారుణ్య నియామకాలు వంటి సమస్యలు దీర్ఘకాలంగా పరిష్కారం కాలేదని చెప్పారు.

## బస్సుకింద పడి మహిళ మృతి


షరీఫా మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ అనిల్‌కుమార్

కలికిరి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు వెనుక చక్రాల కిందపడి షరీఫా (46) అనేమహిళ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఇందిరమ్మ కాలనీ వాసులు షరీఫా, నూరుల్లా బుధవారం స్థానిక బ్యాంకులో పని ముగించుకుని తిరిగి కాలనీకి టీవీఎస్ మోపెడ్‌లో బయలుదేరారు. వెనుక వైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు వీరిని ఓవర్‌టేక్ చేసే క్రమంలో వెనుక చక్రం కింద మోపెడ్ అదుపు తప్పి పడిపోయింది. దీంతో చక్రాల కింద పడిన షరీఫా తీవ్ర గాయాలకు గురైంది. వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఇక బస్సు కింద పడిన మోపెడ్ నుజ్జునుజ్జయింది. వాహనాన్ని నడుపుతున్న నూరుల్లా తృటిలో తప్పించుకుని స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. సంఘటనా స్థలాన్ని, మృతదేహాన్ని సీఐ అనిల్‌కుమార్ పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


కారుకింద పడి నుజ్జునుజ్జు అయిన ద్విచక్ర వాహనం

రాయచోటి నేతాజీ సర్కిల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిలోని ఎస్.సోమవరం గ్రామం బాలయ్యగారిపల్లె క్రాస్‌రోడ్డు వద్ద ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... బుధవారం కలకడ మండలం బాలయ్యగారిపల్లెకు చెందిన భాస్కర్‌రెడ్డి (65) కలకడ సంతకు వచ్చి, ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి వెళ్తుండగా రాయచోటి వైపు నుంచి పీలేరు వైపు వెళ్తున్న కారు ఢీకొంది. దీంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ బాదుల్లా తెలిపారు.

## ఎర్రదుంగలు స్వాధీనం... ఇద్దరి అరెస్టు


పట్టుబడిన దుంగలు, స్మగ్లర్లతో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కోడూరు అటవీ రేంజ్ పరిధిలోని కేవీ బావి బీట్ అటవీ ప్రాంతంలో 10 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఆర్ఐ సాయి గిరిధర్ తెలిపారు. బుధవారం టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ ఎండీ షరీఫ్, ఏఆర్ ఎస్ఐ మహేశ్వర్ నాయుడు బృందం స్థానిక ఎఫ్‌బీవో నాగేశ్వర నాయక్‌తో కలిసి కూంబింగ్ నిర్వహిస్తుండగా నొక్కోడి గుండం వద్ద ఎర్రచందనం తరలిస్తున్న వ్యక్తులు తారసపడ్డారు. వారిపై దాడి చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకోగా, మిగిలిన వారు పారిపోయారు. పట్టుబడిన ఇద్దరూ తమిళనాడు రాష్ట్రానికి చెందిన వారుగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన 10 ఎర్రచందనం దుంగలతో సహా ఇద్దరు స్మగర్లను తిరుపతి టాస్క్‌పోర్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

## ప్రజావాణి సమస్యలకు పరిష్కారం చూపాలి


పెనగలూరు రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ ఆదర్శ రాజేంద్రన్

పెనగలూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో అందే సమస్యలను సత్వరం పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ సూచించారు. బుధవారం సాయంత్రం పెనగలూరు రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బందితో విడివిడిగా సమావేశమయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రజల నుంచి అందే అర్జీల పరిష్కారంపై సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చామన్నారు. సమావేశం అనంతరం కార్యాలయంలో ఉన్న సిబ్బంది విధులు నిర్వహించే గదులు, కంప్యూటర్ గది, రికార్డు గదులను తనిఖీ చేశారు. సమాచార హక్కు వివరాలు తెలిపే బోర్డు సక్రమంగా లేదని, ప్రజలకు కావాల్సిన సమాచారాన్ని సకాలంలో ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా వెన్నర్ల సాయికుమార్‌రెడ్డి జేసీని కోరారు. అందుకు స్పందించిన ఆయన ఈ సమస్యపై వస్తున్న ఫిర్యాదులు పరిష్కరించాలని తహశీల్దారును, డీటీని ఆదేశించారు. ఈ సమావేశంలో తహశీల్దారు అమరేశ్వరి, ఎంపీడీవో విజయరావు, డీటీ సుమని, ఆర్ఐ రామ్మోహన్, సర్వేయర్ ప్రభాకర్, వ్యవసాయాధికారి వీఎన్‌కే సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతలకు ప్రాధాన్యం ఇవ్వండి : డీజీపీ


డీజీపీకి బొకే అందజేస్తున్న ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

రాయచోటిటౌన్, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా నూతన ఎస్పీ ధీరజ్ కునుబిల్లి బుధవారం విజయవాడలోని డీజీపీ కార్యాలయంలో డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. నేరాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులు, సురక్షితంగా ఉండే వాతావరణం కల్పించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కఠిన నిబంధనల అమలుతో పాటు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రజల్లో పోలీసులపై నమ్మకం పెంచేలా పారదర్శకంగా సేవలు అందించాలన్నారు. ఈ మేరకు జిల్లాలోని చట్ట వ్యవస్థలను బలోపేతం చేస్తామని, ప్రజలతో సులభంగా అందుబాటులో ఉండే పోలీసింగ్ కొనసాగిస్తామని ఎస్పీ అన్నారు.

## ఆర్టీసీ అద్దె బస్సు బోల్తా


**● 11 మందికి స్వల్ప గాయాలు**


బోల్తాపడిన బస్సును పరిశీలిస్తున్న ఆర్డీవోలు

ఒంటిమిట్ట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సిద్దవటం మండలం భాకరాపేట సమీపంలోని కల్వర్టు వద్ద ఆర్టీసీ అద్దె బస్సు బోల్తా పడడంతో అందులో ప్రయాణిస్తున్న డ్రైవర్, కండక్టర్ సహా 11 మందికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. బద్వేలు ఆర్టీసీ డిపోకు చెందిన అద్దె బస్సు బుధవారం ఉదయం కడపకు వెళుతూ భాకరాపేట సమీపంలోని కల్వర్టు వద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును తప్పించే యత్నంలో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ వెంటనారాయణ, కండక్టర్ శివయ్య, 9 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడినవారిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు.

కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, కడప, బద్వేలు ఆర్డీవోలు జాన్ ఎర్విన్, చంద్రమోహన్, బద్వేల్ ఆర్టీసీ డిపో మేనేజర్ నిరంజన్, సీఐ బాబు, బెటాలియన్ కమాండెంట్ ఆనంద్‌రెడ్డి, ఆర్ అండ్ బి ఏఈ రామాంజనేయులు, డిప్యూటీ తహశీల్దారు మాధవీలత, ఎస్ఐ మహమ్మద్‌రఫీ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. భాకరాపేట సమీపంలోని కల్వర్టుకు ఇరువైపులా రక్షణ గోడ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

## మద్యం దుకాణంలో చోరీ


దుకాణం పైకప్పును కత్తిరించిన దృశ్యం

గుర్రంకొండ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ పట్టణంలోని ఓ మద్యం దుకాణంలో మంగళవారం అర్ధరాత్రి మద్యం చోరీ జరిగింది. పట్టణంలోని నబీకాలనీలో మద్యం దుకాణాలను నిర్వహిస్తున్నారు. ఎప్పటిలాగే మంగళవారం రాత్రి నిర్వాహకులు మద్యం దుకాణాన్ని మూసేసి తాళం వేసుకుని వెళ్లారు. ఉదయం వచ్చేసరికి మద్యం దుకాణం వాకిలి తీసి చూడగా మద్యం బాటిళ్లు చిందర వందరగా పడివున్నాయి. దుకాణం పైకప్పునకు అమర్చిన రేకును దుండగులు కత్తిరించి లోపలికి ప్రవేశించారు. దుకాణంలో కొన్ని మద్యం బాటిళ్లను తీసుకెళ్లినట్లు నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మద్యం దుకాణంలో చోరీ జరిగిన తీరును పరిశీలించి డాగ్ స్క్వాడ్‌ను పిలిపించి వివరాలను సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రఘురాం తెలిపారు.

### మద్యంప్రియుల పనేనా...?

పట్టణంలో మద్యం దుకాణంలో జరిగిన చోరీ మద్యం ప్రియులే చేసి ఉంటారని స్థానికులు, ప్రజలు చర్చించుకుంటున్నారు. చోరీ జరిగిన మద్యం దుకాణం పక్కన, వెనుకనే బెల్టు, సిట్టింగ్ రూములున్నాయి. మద్యం దుకాణం రాత్రి 10 గంటలకు మూసేస్తారు. బెల్టు, సిట్టింగ్ రూములు అర్ధరాత్రి వరకు తెరచి ఉండడంతో మందుబాబులతో కిటకిటలాడుతుంటాయి. ఈ క్రమంలో మద్యం దుకాణం గురించి పూర్తిగా తెలిసిన వ్యక్తులే చోరీకి పాల్పడి ఉంటారనేది ప్రజల వాదన. అంతేకాకుండా సిట్టింగ్ రూముతో మందుబాబుల ఆగడాలు అధికంగా ఉన్నట్లు చుట్టు పక్కల నివాసితులు వాపోతున్నారు. బెల్టు, సిట్టింగ్ రూములపై చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్‌శాఖ అధికారులకు పలుమార్లు తెలిపినా పట్టించుకోవడం లేదని మహిళలు ఆరోపిస్తున్నారు. ఇకనైనా బెల్టు, సిట్టింగ్ రూములను తొలగించాలని మహిళలు కోరుతున్నారు.



గుర్రంకొండలో చోరీ జరిగిన మద్యం దుకాణం

# మహిళలు ఆర్థిక శక్తిగా ఎదిగేందుకు..!

- చేయూతనిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- చిరు వ్యాపారులకు ప్రోత్సాహకాలు
- వ్యాపారాల కోసం రూ.2లక్షల వరకు సాయం

కడప ఎన్టీఆర్ సర్కిల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబంలో ఒక మహిళా పారిశ్రామికవేత్తను తయారు చేయాలనే విధంగా సీఎం చంద్రబాబు అధికారులకు ఇప్పటికే దిశ నిర్దేశం చేశారు. దీంతో జిల్లాలోని 35 మండలాల్లో పది వేల మందిని పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలనేది లక్ష్యం. కాగా ఇప్పటి వరకు 2,916 మందికి సంబంధించిన దరఖాస్తులను బ్యాంకులకు పంపారు. అందులో 2,828 మందికి రుణం అందించారు. మరో 88 మందికి సంబంధించిన దరఖాస్తులను బ్యాంకర్లు పరిశీలిస్తున్నారు. జిల్లాలో మహిళా పారిశ్రామికవేత్తలకు సంబంధించిన రుణాల మంజూరుపై గణాంకాలను పరిశీలిస్తే.. రాజుపాలెం, కొండాపురం, మైదుకూరు, ఎర్రగుంట్ల, పెద్దముడియం, వేంపల్లె, ఖాజీపేట, జమ్మలమడుగు, చింతకొమ్మదిన్నె, దువ్వూరు, వేముల, కమలాపురం మండలాల్లో యూనిట్ల స్థాపనలో మెరుగైన ఫలితాలు కనిపిస్తున్నాయి. ఇక ముద్దనూరు, సిద్దవటం, చెన్నూరు, గోపవరం, లింగాల, బి.కోడూరు, కాశినాయన, మైలవరం వల్లూరు, చాపాడు, పోరుమామిళ్ల, సింహాద్రిపురం, ఒంటిమిట్ట, పెండ్లిమర్రి మండలాల్లో సింగిల్ డిజిట్‌లో యూనిట్ల ఏర్పాటు జరిగింది. అట్లూరు, బద్వేలు, బి.మఠం, చక్రాయపేట, కలసపాడు, ప్రొద్దుటూరు, పులివెందుల, తొండూరు, వీఎన్‌పల్లె మండలాల్లో ఇప్పటి వరకు ఒక పరిశ్రమ కూడా ఏర్పాటు కాలేదు.

**ప్రత్యేక సర్వే....**

ఈ లక్ష్యసాధనలో భాగంగా క్షేత్రస్థాయిలో ప్రత్యేక సర్వేను చేపడతున్నారు. అధికారులు నేరుగా మహిళలు నిర్వహిస్తున్న పరిశ్రమల వద్దకు వెళ్లి వివరాలు సేకరించనున్నారు. వారు ఎలాంటి వ్యాపారం చేస్తున్నారు, ఎంత ఆదాయం పొందుతున్నారు. ఎంత మందికి ఉపాధి కల్పిస్తున్నారు. వంటి కీలక సమాచారాన్ని నమోదు చేసుకుంటారు. ఈ సమాచారం ఆధారంగా యూనిట్లను జీవనోపాధుల, ఎంటర్‌ప్రెన్యూర్, ఎంటర్‌ప్రైజెస్ అనే మూడు విభాగాలుగా వర్గీకరించి వాటి అభి వృద్ధికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేస్తారు. ఈ సర్వేలో గుర్తించిన అర్హులైన మహిళలకు తమ వ్యాపారాలను విస్తరించుకునేందుకు ప్రభుత్వం ఆర్థిక చేయూత అందించనుంది. బ్యాంకుల ద్వారా కనిష్ఠంగా రూ.10వేల నుంచి గరిష్ఠంగా రూ.2లక్షల వరకు రుణం మంజూరు చేయనున్నట్లు అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. అంతే కాకుండా స్త్రీనిధి పథకం ద్వారా రూ.లక్ష వరకు, ఎస్సీ ఎస్టీ ఉన్నతి పథకం కింద రూ.2లక్షల నుంచి అవసరాన్ని బట్టి రూ.10లక్షల వరకు కూడా రుణాలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే యూనిట్ విస్తరణకు రుణాలు పొందాలంటే ఆ వ్యాపారం ద్వారా కనీసం మరొకరికి ఉపాధి కల్పించాలనే నిబంధనలను పాటించాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం జిల్లాలో చాలా మంది మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా డెయిరీ, పచ్చళ్లు, ఆహారశుద్ధి, కలంకారి, పేపరు ప్లేట్లు వంటి చిన్నతరహా పరిశ్రమలను విజయవంతంగా నడుపుతున్నారు. ఈ యూనిట్ల వివరాలను, ఫొటో లను ప్రత్యేక యాప్‌లో నమోదు చేసి పారదర్శకత పాటిస్తున్నారు. ఈ పథకంపై మరింత సమాచారం కావాల్సిన వారు స్థానిక అధికారులను సంప్రదించాలని డీఆర్‌డీఏ అధికారులు సూచిస్తున్నారు.

**వచ్చే మహిళా దినోత్సవానికి వందలాది మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు పరిశ్రమలశాఖ, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ప్రత్యేక సర్వే చేపడుతున్నారు. స్త్రీనిధి, ఉన్నతి పథకాల కింద మహిళలకు అదనపు రుణాలు అందించి వారిని ఆర్థికంగా శక్తివంతులుగా తీర్చిదిద్దేందుకు ఒక బృహత్తర కార్యక్రమాన్ని చేపడుతున్నారు.**

### మహిళా పారిశ్రామికవేత్తలే లక్ష్యం



చిరు వ్యాపారాలు చేస్తున్న మహిళలను ప్రోత్సహించి ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగానే స్వయం సహాయక సంఘాల్లో సభ్యులై ఉండి వ్యాపారాలు మొదలుపెట్టిన మహిళలను గుర్తించి వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు సర్వేలు నిర్వహిస్తున్నాం. వారి అభిరుచులకు అనుగుణంగా వివిధ రంగాల్లో వ్యాపార విస్తరణకు చర్యలు తీసుకుంటున్నాం.

-డాక్టర్ జి.రాజ్యలక్ష్మి, పీడీ , డీఆర్‌డీఏ

### ఆర్థిక అభ్యున్నతి దిశగా అడుగులు



పెండ్లిమర్రి మండలం వెల్లటూరులోని మహిళల చేత అగరబత్తుల పరిశ్రమ నిర్వహించడం స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.

మహిళలు తమ గృహ పనులతో పాటు అగరబత్తుల పరిశ్రమను విజయవంతంగా నడిపిస్తూ కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగు పరుస్తున్నారు. ఈ చిన్న స్థాయి పరిశ్రమ ఇప్పుడు గ్రామంలోనే అనేక కుటుంబాలకు ఉపాధి అవకాశాలను కల్పిస్తోంది. ఇంటి ఆవరణలోనే పరిశ్ర మను నడుపుతూ అగరబత్తులు తయారు చేసి స్థానిక మార్కెట్‌లోకి తీసుకు వెళతున్నారు. ఈ పరిశ్రమ వల్ల గ్రామంలోని మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యంతో పాటు సామాజిక గౌరవం కూడా దక్కుతోంది.



ఖాజీపేట మండలం కొత్తపేటలోని కూసాల కొట్టాలకు చెందిన నాగలక్ష్మమ్మ అనే గిరిజన మహిళ ఉన్నతి ద్వారా లక్ష రూపాయలు రుణం పొంది చీపుర్ల తయారీ పరిశ్రమను ఏర్పాటు చేశారు. మొదట ఈమె తన భర్త సుబ్బరాయుడుతో కలిసి కూలీ పనులకు వెళ్లేవారు. పనులు లేని కాలంలో పూట గడవడం కూడా కష్టంగా సాగేది. 2004లో పొదుపు సంఘంలో చేరారు. వెలుగు సిబ్బంది ప్రోత్సాహంతో కొంత మేర రుణం తీసుకుని చీపురు పుల్లల వ్యాపారం ప్రారంభించారు. తరువాత ఉన్నతి ద్వారా మరికొంత రుణాన్ని తీసుకుని వ్యాపారం అభివృద్ధి చేసుకున్నారు. చీపురు పుల్లలను ఏలూరు, విజయవాడ ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటు న్నారు, ఒక లోడుకు రూ.50వేల నుంచి మూడున్నర లక్షల వరకు ఖర్చు చేస్తున్నట్లు సుబ్బలక్షుమ్మ చెబు తున్నారు. ఇప్పుడు కూలీ పనులు మానేసి వ్యాపారం ద్వారా మెరుగైన జీవనో పాధిని పొందామని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## ఘనంగా విశ్వకర్మ మహర్షి జయంతి వేడుకలు



విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అదనపు ఎస్పీ

కడప క్రైం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భారతీయ పురాణాల్లో దేవశిల్పిగా వర్ణింపబడే విశ్వకర్మ మహర్షి విశిష్ట స్థానం కలిగిన రుషి అని, సమాజానికి కృషి, నైపుణ్యం, సాంకేతికత, ఆవిష్కరణలకు ప్రతీకగా నిలిచారని జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన) కె.ప్రకాశ్‌బాబు అన్నారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ చిత్రపటానికి అదనపు ఎస్పీ పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. భాద్రపద శుక్ల తృతీయ రోజు విశ్వకర్మ జయంతి జరుపుకుంటారని, కార్మికులు, శిల్పులు, ఇంజనీర్లు, మెకానిక్‌లు, సాంకేతికరంగానికి సంబంధించిన వారు విశ్వకర్మ ను తమ ప్రేరణగా భావించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని తెలిపా రు. అదనపు ఎస్పీ(ఏఆర్) బి.రమణయ్య మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక యుగంలో విశ్వకర్మ మహర్షి సిద్ధాంతాలు, సృజనాత్మకత, పట్టుదల, శ్రమించే తత్వాన్ని అలవరచుకుంటే ఎంత కష్టమైన పని అయినా తేలికగా సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు శివరాముడు, శ్రీశైల రెడ్డి, టైటస్, సోమశేఖర నాయక్, ఆర్‌ఎస్‌ఐలు, పోలీసు, డీపీవో సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాల స్థల ఆక్రమణపై పరిశీలన




ఎస్ఎస్ఏ పీవోకు వివరిస్తున్న మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి

చెన్నూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపేట ప్రాథమిక పాఠశాలకు సంబంధించిన స్థలాన్ని అక్రమంగా రిజిస్టరు చేసుకుని విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నారంటూ ఆ గ్రామ మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి ఇటీవల మంత్రి నారా లోకేశ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం కడప సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్టు అధికారి నిత్యానందరాజు పరిశీలనకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల గదులను, పూర్వం పాఠశాల స్థల విస్తీర్ణం, ప్రస్తుతం ఎంత ఉంది, ఎంత ఆక్రమణకు గురైంది అన్న విషయాలపై కూలంకుషంగా పరిశీలించారు. అలాగే పాఠశాల చుట్టూ సచివాలయ సర్వేయరుతో కొలతలు వేయించి ఆ నివేదిక తీసుకున్నారు. అదే సమయంలో మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి పాఠశాల వద్దకు వచ్చి గతంలో ఇదే గ్రామానికి చెందిన దాత పది సెంట్ల స్థలాన్ని పాఠశాల నిర్మాణం కోసం ఇచ్చారన్నారు. అయితే ఇదే గ్రామానికి చెందిన మన్నె విజయభాస్కర్‌రెడ్డి, మన్నె విశ్వనాథరెడ్డి అనే వ్యక్తులు తప్పుడు డాక్యుమెంట్లతో ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారని ఆరోపించారు. ఇందుకు స్పందించిన పీడీ మాట్లాడుతూ పాఠశాల స్థల ఆక్రమణకు సంబంధించి నివేదికను ఆర్డీవోకు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ డీఈ సుధాకర్‌రెడ్డి, వీఆర్వో లక్ష్మీదేవి, సర్వేయరు రామచంద్ర, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## స్త్రీశక్తి పథకం అద్భుతం

- ఆర్టీసీ కడప జోనల్ చైర్మన్ పూల నాగరాజు



కడప మారుతీనగర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన స్త్రీశక్తి పథకం అద్భుతమని ఆర్టీసీ కడప జోనల్ చైర్మన్ పూలనాగరాజు అన్నారు. స్త్రీశక్తి పథకం అమలు చేసి నెలరోజులు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం కడపలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం చేసేందుకు వీలుగా ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథకం వారి జీవితాల్లో వెలుగులు నింపుతోందన్నారు. ఈ పథకం దిగ్విజయం కావడానికి ఆర్టీసీ పైస్థాయి నుంచి కింది స్థాయి ఉద్యోగుల కృషి దాగి ఉందన్నారు. నెల రోజుల్లో కడప జోన్ పరిధిలో సుమారు 22 లక్షల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేసినట్లు వెల్లడించారు. దీంతో జోన్‌కు సుమా రు రూ.262 కోట్లు ఆదాయం రాగా.. ఇందులో రూ.82 కోట్లు జీరో టికెట్ కింద ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఇటీవల అనంతపురం జిల్లాలో జరిగిన సూపర్‌సిక్స్, సూపర్ హిట్ బహిరంగసభకు దాదాపు 3200 బస్సులు నడిపామన్నారు. దీంతో ఆర్టీసీకి మంచి ఆదాయం చేకూరిందన్నారు. ముఖ్యంగా కడప జోన్‌లో దాదాపు 500 బస్సులు అవసరమని, కండక్టర్లు, డ్రైవర్లు కొరత కూడా ఉందన్నారు. కార్యక్ర మంలో ఆర్టీసీ కడప రీజనల్ మేనేజరు గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## డ్వాక్రా మహిళలకు పాడి పశువుల పంపిణీ

- డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి

కడప ఎన్టీఆర్ సర్కిల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలకు 12వేల పాడి పశువులను పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ రాజ్యలక్ష్మి తెలిపారు. స్థానిక పీజీఆర్ఎస్ భవనంలో డీఆర్‌డీఏ, పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడిపశువులను గ్రౌండింగ్ చేయడం కోసం గ్రామ, మండల స్థాయిలో లబ్ధిదారుల కు తగిన అవగాహన కల్పించాలని వెలుగు సిబ్బందికి సూచించారు. ప్రణాళికాబద్ధంగా ఈనెల 30 నాటికి గ్రౌండింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా వెలుగు ఏపీయంలతో వివిధ పథకాలపై సమీక్ష నిర్వహించారు.

పశుసంవర్ధకశాఖ జేడీ శారదమ్మ మాట్లాడుతూ వెలుగు సిబ్బంది గ్రౌండింగ్ చేసే పాడి పశువులకు తమ శాఖపరిధిలోని డిప్యూటీ డైరెక్టర్లు, ఏడీలు మండలస్థాయిలో పశువైద్యులు వారి శాఖకు సంబంధించిన అనుబంధ పనులకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తారని తెలిపారు. ఎల్‌డీఎం జనార్ధన్ మాట్లాడుతూ వెలుగు సిబ్బందికి కావాల్సిన బ్యాంకు రుణాలు మంజూరు చేయడంలో జాప్యం జరగకుండా చూస్తామన్నారు. సమావేశంలో యూనియన్ బ్యాంకు ఆర్ఎం, పశు సంవర్ధకశాఖ డీడీలు, ఏడీలు, డీఆర్‌డీఏ ఏపీడీ, వెలుగు డీపీఎంలు, ఏపీయంలు హాజరయ్యారు.

## టెంకాయల వేలం వాయిదా

చక్రాయపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో బుధవారం నిర్వహించిన టెంకాయల వేలంపాట వాయిదా వేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ జె.వెంకటసుబ్బయ్య తెలిపారు. గత ఏడాది టెంకాయల వేలం రూ.80 లక్షలకు పలికిందన్నారు. ఈ ఏడాది రూ.80 లక్షల నుంచే వేలం పాట మొదలు పెట్టగా.. ఎవరు ముందుకు రాకపోవడతో వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శివయ్య, ప్రధాన అర్చకులు కేసరి, పోలీసు, బ్యాంకు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

## పీజీఆర్ఎస్ ఆడిట్ అంశాలపై సమీక్ష

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదలపై బుధవారం రాష్ట్రస్థాయి చీఫ్ కో ఆర్డినేటర్ చిన్నారావు జిల్లా రెవెన్యూ అధికారులతో వీసీ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్‌లోని వీసీ హాలులో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, జిల్లాకు సంబంధించి నోడల్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారావు మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధించి ఆడిట్ అంశాలపై ఆరా తీశారు. ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలన్నారు.

## డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ విద్యార్థులకు సీఓఏ అనుమతులు

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీకి చెందిన 2020-21, 2021-22, 2022-23 బ్యాచ్ విద్యార్థులకు కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (సీఓఏ) కోర్సు అనుమతులు, ఎన్‌రోల్‌మెంట్ నెంబర్లు మంజూరయ్యాయని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ విశ్వనాథ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు, ఉన్నత విద్యా ప్రధాన కార్యదర్శి కోన శశిధర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

## వర్షంతో రద్దయిన కర్నూలు - చిత్తూరు మ్యాచ్

- డ్రాగా ముగిసిన కడప -అనంతపురం మ్యాచ్

కడప స్పోర్ట్స్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య జరుగుతున్న ఏసీఏ సౌత్ జోన్ అండ్-23 మెన్స్ మల్టీడే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లో భాగంగా ఆటకు చివరి రోజు బుధవారం కర్నూలు, చిత్తూరు జట్ల మధ్య సాగిన మ్యాచ్ వర్షం కారణంగా తుడిచిపెట్టుకుపోయింది. కడప, అనంతపురం జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్ డ్రాగా ముగిసింది.

## హత్య కేసులో మహిళకు జీవిత ఖైదు

రాజంపేట టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో ఓ మహిళకు జీవిత ఖైదు విధిస్తూ జిల్లా మూడవ అదనపు జడ్జి ప్రవీణ్‌కుమార్ తీర్పు నిచ్చారు. పట్టణ సీఐ నాగార్జున కథనం మేరకు వివరాలిలా... రాజంపేట పట్ట ణంలోని ఎర్రబల్లెలో నివాసం ఉంటున్న నర్రెడ్డి సుమిత్రమ్మను 2019 సంవత్స రంలో ఆమె వియ్యంకురాలు వెలిచెలమల ఇందిరమ్మ ఇంట్లో ఎవరూ లేని సమ యంలో హతమార్చి, ఇంట్లోని బంగారు సరుడు, డైమండ్ నెక్లెస్, ఒక జత చెవి కమ్మలు, వెండి దీపాలు దొంగలించి, ఇంట్లో దొంగలు పడి నగలు అపహరిం చడమే కాకుండా హత్య చేశారని నమ్మించింది. మృతురాలి కుమారుడు మహీ ధర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు అప్పటి పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యా ప్తు చేశారు. ఈ కేసు చార్జిషీట్‌లో ఐదుగురు నిందితులుండగా, ఇందిరమ్మ నేరం చేసినట్లు రుజువు కావడంతో ఆమెకు జీవిత ఖైదు, రూ.5వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

## హార్టికల్చర్ డీడీగా సతీష్ బాధ్యతలు



కడప రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉద్యానశాఖ డిప్యూటీ డైరక్టర్ (డీడీ)గా జి.సతీష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఉద్యాన శాఖ సహాయ సంచాలకులుగా (ఏడీ)గా ఉంటూ ఫారిన్ సర్వీస్‌పై చిత్తూరు జిల్లా ఏపీఎంఐపీ పీడీగా పనిచేస్తున్న ఈయనకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉద్యానశాఖ డీడీగా పదోన్నతి కల్పించి వైఎస్ఆర్ కడప జిల్లాకు నియమించారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు.

## సచివాలయ సిబ్బందికి పీ-4 బాధ్యతలు

- అవగాహన సదస్సులో సీపీవో హజరత్తయ్య



పీ4 శిక్షణలో మాట్లాడుతున్న సీపీవో హజరత్తయ్య

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పేదల ఆర్థిక స్థితిగతులు మెరుగుపరిచి బంగారు కుటుంబాలుగా తీర్చే క్రమంలో సచివాలయ ఉద్యోగుల పాత్ర కీలకమని జిల్లా ప్రణాళికాధికారి హజరత్తయ్య పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సభాభవనంలో రాష్ట్ర ప్రభుత్వం పేదరిక నిర్మూలనకు తీసుకుంటున్న పీ4 పాలసీకి సంబంధించి సచివాలయ ఉద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీవో మాట్లాడుతూ పీ4 పథకం అమలులో పేదరికంతో ఉన్నవారిని బంగారు కుటుంబాలుగా, వారికి తోడ్పాటునందించే మార్గదర్శుల సమన్వయ బాధ్యతలను చేసుకోవాలన్నారు. బంగారు కుటుంబాలకు, మార్గదర్శులకు సమన్వయకర్తలుగా సచివాలయ ఉద్యోగులు కీలకపాత్ర పోషించి లక్ష్యాలను సాధించాలన్నారు. క్లస్టర్ వారీగా మార్గదర్శులు, బంగారు కుటుంబాలను విభజించి కార్యదర్శులకు బాధ్యతలను అప్పగించారు.

## పారా మెడికల్ డిప్లొమా కోర్సులకు దరఖాస్తులు

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేట్ కళా శాలల్లో పారా మెడికల్ రెండేళ్ల కోర్సులకు దరఖాస్తులు ఆహ్వా నిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు. ఈ మేరకు 2025-26 విద్యా సంవత్సరానికి సంబం ధించి రాష్ట్ర ప్రభుత్వ పారా మెడికల్ బోర్డు నోటిఫి కేషన్ విడుదల చేసిందన్నారు. ఈ కోర్సుల్లో ప్రవేశానికి ఇంటర్ పాసైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఎంపిక చేసిన విద్యార్థులకు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో శిక్షణ కోర్సులు ఇస్తారని తెలిపారు. దరఖాస్తు గడువు పెంచినందున ఆసక్తి గల విద్యార్థు లు ఈనెల 27 వతేదీ సాయంత్రం 5గంటల లోపు కడప డీఎంహె చ్‌వో కార్యాలయంలో అందజేయాలన్నారు.

## యూరియా రాయితీ... రైతులను మోసం చేయడమే!

- ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి

కడప సెవెన్‌రోడ్స్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతాంగానికి అవసరమైనంత యూరియా సరఫరా చేయకుండా వాడకాన్ని తగ్గించుకుంటే రూ.800 రాయితీ ఇస్తామని ప్రభుత్వం ఊరించడం రైతులను వంచించడమే అని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో యూరియా వాడకం తగ్గిస్తే బస్తాకు రూ.800 రాయితీ ఇస్తామని చెప్పడం రైతులను మభ్యపెట్టడానికే అన్నారు. కేంద్రం నుంచి రూ.500 కోట్లు తీసుకొని రైతులకు యూరియా వాడకాన్ని తగ్గించుకోమని చెప్పడం దారుణమన్నారు. వ్యవసాయాభివృద్ధికి, ఆహార ధాన్యాల ఉత్పత్తికి కీలకమైన ఎరువులను అవసరమైనన్ని సరఫరా చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. క్యాన్సర్ రావడానికి అనేక కారణాలు ఉన్నాయని, యూరియా వాడకంతో వస్తుందని చెప్పడానికి ఎలాంటి ఆధారాలేవన్నారు. భవిష్యత్తులో ఎరువులకు ప్రభుత్వాలు నగదు బదిలీ విధానాన్ని తెచ్చే ప్రమాదం పట్ల అప్రమత్తంగా ఉండాలని రైతాంగానికి విజ్ఞప్తి చేశారు.

## పద్య పఠన పోటీల్లో గౌరికి రాష్ట్ర స్థాయి బహుమతి



మైదుకూరు రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వనిపెంట బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న వీరమల్లు గౌరి రాష్ట్రస్థాయి తెలుగు పద్య పఠన పోటీలలో ప్రథమ బహుమతి సాధించినట్లు ఆ పాఠశాల ప్రిన్స్‌పాల్ నిర్మల తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో గురుకుల పాఠశాలల విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన ఈ పోటీల్లో గౌరి మంచి ప్రతిభ కనబరిచి మొదటి బహుమతి సాధించిందన్నారు. అలాగే మూడు భాషల్లో జిల్లా స్థాయిలో కూడా ప్రథమ స్థానం సాధించిందన్నారు. ఈసందర్భంగా శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయురాలు ప్రత్యూష, గౌరి తల్లి దండ్రులకు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

## బొలెరో క్యాంపర్ బోల్తా.. ఒకరు మృతి

చక్రాయపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరువుకాంపల్లె వద్ద బొలెరో క్యాంపస్ బోల్తాపడిన ఘటనలో అజయ్ అనే కూలి మృతి చెందినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన మేరకు వివరాలిలా.. మండలంలోని గండికొవ్వూరు-కుమార్లకాల్వ వద్ద సీఆర్ కంపెనీకి చెందిన బ్రిడ్జి పనులు జరుగుతున్నాయి. ఈ పనుల కోసం యూపీ నుంచి కూలీలు వచ్చారు. నీటి కోసం వేంపల్లె వైపు వెళ్తున్న క్రమంలో చెరువు కాంపల్లె వద్ద క్యాంపర్ బోల్తాపడింది. ఈఘటనలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన పది మంది కూలీలకు గాయాలయ్యాయి. వీరిని వేంపల్లె ప్రభుత్వ ఆసుప త్రికి తరలించారు. అజయ్ అనే కూలి చికిత్స పొందుతూ మృతి చెందారు. మరో ఇద్దరి పరిస్థితి విషయంగా ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో మండలం పూజలు



స్వామి, అమ్మవారికి అభిషేకం చేస్తున్న వేదపండితులు - హాజరైన భక్తులు

పీలేరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): గాలివారిపల్లెలో ఎన్‌ఆర్‌ఐ ముప్పవరపు నాగరాజు నాయుడు నిర్మించిన సీతారామ సమేత అభయాంజనేయస్వామి ఆలయంలో బుధవారం మండలం పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. అమెరికాలో స్థిరపడిన నాగరాజు నాయుడు స్వగ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరియాలన్న సంకల్పంతో సుమారు రూ.2 కోట్లతో నిర్మించిన సీతారామ సమేత అభయాంజనేయస్వామి ఆలయాన్ని ఈ ఏడాది జూలై 29, 30, 31వ తేదీల్లో ప్రారంభించారు. అప్పటి నుంచి ఆలయంలో నిత్యపూజలు జరిపి బుధవారం మండలం పూజలు నిర్వహించారు. పూజలకు గాలివారిపల్లె సహా పరిసర ప్రాంతాల్లోని ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. బుధవారం ఉదయం స్వామి, అమ్మ వారి విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, వివిధ హోమాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో నాగరాజు నాయుడు తల్లిదండ్రులు ముత్యాలయ్య, లక్ష్మీదేవి, గాలి రెడ్డయ్య నాయుడు, గాలి ఆనంద నాయుడు, నవీన్, ఎంజీవీ రమణ, ఆంజనేయులు, రవి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మోదీ జన్మదిన వేడుకలు

### రక్తదానం చేసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్



రక్తదానం చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలో భారతదేశ ప్రధాని నరేంద్రమోదీ 75వ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పలు సేవాకార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ సహా 75 మందికిపైగా రక్తదానం చేశారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యల్లంపల్లె ప్రశాంత్, టౌన్ అధ్యక్షుడు మఠం కిరణ్ కుమార్, నవభారత నిర్మాణ సంస్థ అధినేత వరదారెడ్డి నారథరెడ్డి ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. సేవా పక్వాడా పక్షోత్సవాల్లో భాగంగా మొదటి రోజు రక్తదాన శిబిరాలను దేశం మొత్తం ఏర్పాటు చేశారు. నిమ్మనపల్లె సర్కిల్‌లో ఆనంద్ టీస్టాల్‌లో యాజమాని ఈ రోజు మొత్తం టీ, పాలు, కాఫీ ప్రజలకు ఫ్రీగా అందించారు. జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ దేశాభివృద్ధిని కాంక్షించే ప్రదాత, దేశం పురోగతిన నడుస్తోందన్నారు. అన్ని రాష్ట్రాల్లో బీజేపీని బలోపేతం చేయడానికి గ్రామ కమిటీలు వేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు చల్లపల్లె నరసింహారెడ్డి, విజయభారతి సేతు, జిల్లా ప్రధాన కార్యదర్శులు యల్లంపల్లె ప్రశాంత్, పులి నరేంద్రకుమార్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఆకులు కృష్ణమూర్తి, కిసాన్ మోర్చా రాయలసీమ జోన్ ఇన్‌చార్జ్ ఓసూరి కిరణ్‌కుమార్, బండినందర్, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు పిల్లస్వామి నాయక్, బాలజ్యోతి, పట్టణ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, పూల నాగరాజు, మదనపల్లె రూరల్ మండల అధ్యక్షుడు తరిగొండ వెంకటరమణారెడ్డి, జేకే వర్మ, జనసేన నేతలు అజయ్, దిలీప్ పాల్గొన్నారు.

### పీలేరు ఎస్‌జీ డిగ్రీ కళాశాలలో....



రక్తదాన శిబిరంలో పాల్గొన్న బీజేపీ నేతలు

పీలేరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని బుధవారం పీలేరులోని బీజేపీ నేతలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎస్‌జీ డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు చంద్రశేఖర రెడ్డి మాట్లాడుతూ అకుంఠిత దీక్ష, దేశానికి సేవ చేయాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్న ప్రధాన మంత్రికి దేశప్రజలు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. రక్తదాన శిబిరంలో 38 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో పీలేరు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్, బీజేపీ నేతలు వెంకటరమణ, పురుషోత్తం, పీఎంఖాన్, సుదర్శన్ రెడ్డి, సుధారాణి, మహదేవనాయుడు, నాగేంద్ర నాయుడు, రెడ్డీశ్వర నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



## సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలి

ములకలచెరువు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేదలకు కార్పొరేషన్ అందిస్తున్న సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి అంజనప్ప డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం జరిగిన ముఖ్య నేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరు నెలల కిందట ప్రభుత్వం బీసీ, ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు ఆహ్వానించడంతో యువతీ, యువకులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. హంద్రీ - నీవా జలాలతో చెరువులు నింపాలన్నారు. నేతలు నిజాముద్దీన్, రామచంద్ర, శివప్ప, రెడ్డెప్ప పాల్గొన్నారు.



# మహిళల ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకుందాం

**ఆరోగ్య పరిరక్షణ కోసమే స్వస్థ్ నారీ స శక్తి అభియాన్ ● దృష్టి సారించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు**





పీలేరు ప్రభుత్వాస్పత్రిలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు, కూటమి నేతలు - పీటీఎంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది

పీలేరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసమే కేంద్ర ప్రభుత్వం 'స్వస్థ్ నారీ-స శక్త్ పరివార్ అభియాన్' చేపట్టిందని పీలేరు ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కోటపల్లె బాబు రెడ్డి, సభ్యులు పోలిశెట్టి సురేంద్ర పేర్కొన్నారు. పీలేరు ఆస్పత్రిలో బుధవారం వారు 'స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్' వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతర కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఇంటి పనుల వత్తిడి, బాధ్యతల కారణంగా మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపరని, తద్వారా వారు తరచూ అనారోగ్యం పాలవుతుంటారన్నారు. వారిని ఆరోగ్యవంతులుగా తీర్చదిద్దే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటోందన్నారు. ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంత మహిళలకు ఉచితంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయడమే కాకుండా మందులు కూడా అందిస్తారన్నారు. మహిళలు ఈ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ప్రచార పత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్, వైద్యులు నాగవేణి, పుష్ప, కరీముల్లా, మంజుల, ఏఎంసీ ఛైర్మన్ పురం రామ్మూర్తి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు చంద్రశేఖర రెడ్డి, బీజేపీ నేతలు వెంకటరమణ, టీడీపీ నేత కోటపల్లె శ్రీనాథరెడ్డి, జనసేన నేతలు కలప రవి పాల్గొన్నారు.

### మెరుగైన వైద్య సేవలు...

తంబళ్లపల్లె, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మహిళలకు మెరుగైన వైద్య సేవలు, ఆరోగ్య పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తలపెట్టిన స్వస్థ్ నారీ-స శక్త్ పరివార్ అభియాన్ దోహదపడుతుందని తంబళ్లపల్లె ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి తేజశ్విని అన్నారు. ఆస్పత్రిలో మహిళలకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ మహిళలకు వివిధ రకాల స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి తగిన వైద్య సేవలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో వైద్యులు విక్రాంత్ రెడ్డి, హెడ్ నర్సు గ్లోరి, నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

### సమాజానికి ఉపయోగపడాలి

నిమ్మనపల్లి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మహిళలు, చిన్నపిల్లలు, ప్రజలు ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరంగా, ఆనందంగా వుండి సమాజానికి ఉపయోగపడేలా ఉండాలని వైద్యాధికారి రమేష్‌బాబు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రధాని జన్మదినం పురస్కరించుకుని స్వస్తనారి స శక్త్ పరివార్ అభియాన్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రక్తపోటు, నోటి క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, మధుమేహం వున్న ప్రజలు సరైన పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. తల్లీ బిడ్డ సేవలు, వృద్ధాప్య ఆరోగ్య పరీక్షలు, కిశోర బాలికల ఆరోగ్య పరీక్షలు, క్షయ వ్యాధి ఆయుష్ సేవలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రత్యూష, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే...

పెద్దతిప్పసముద్రం సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే వారి కుటుంబం కూడా ఆరోగ్యమంతంగా ఉంటుందని ఐసీడీఎస్ పెద్దతిప్పసముద్రం సెక్టార్ సూపర్ వైజర్ హిజాద్ ప్యారీ అన్నారు. మండలంలోని 74 అంగన్ వాడీ కేంద్రాల్లో ఈ నెల 17వ తేదీ నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల ఆరోగ్యంపై దృష్టి కేంద్రీకరిస్తూ స్వస్థ్ నారీ స శక్త్ పరివార్ అభియాన్ పథకాన్ని అమలు చేయనుందన్నారు. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీల శిక్షణ చేపడుతున్నామన్నారు. మహిళలు స్థూలకాయం నివారణకు చక్కెర, నూనె వినియోగాన్ని తగ్గించడం, బాల్య దశ సంరక్షణ, విద్య మూలం అని అన్నారు. శిశువు, చిన్న పిల్లల ఆహారపు అలవాట్లు వాటి పద్దతులపై మహిళలు అవగాహన కలిగి ఉండాలన్నారు. పోషణ, సంరక్షణలో పురుషుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలన్నారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణి, బాలింతలు, శిశు, చిన్న పిల్లల ఆహారపు అలవాట్లు, వండుకునే పద్దతుల గురించి అవగాహన చేపట్టారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతగా పనిచేయండి

**● అధికారులకు సూచించిన ఎమ్మెల్యే**



సమావేశంలో అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాష

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అధికారులు బాధ్యతగా పనిచేస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాష అన్నారు. బుధవారం ఎంపీడీఓ సమావేశ భవనంలో ఎంపీపీ రెడ్డెమ్మ ఆధ్యక్షతన నిర్వహించిన మండల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని చెరువులు కబ్జాకు గురవుతున్నాయని, రేషన్ కార్డుల మంజూరులో సమస్యలు వస్తున్నాయన్నారు. ప్రభుత్వ స్థలాల్లో నకిలీ ఇంటి పట్టాలు సృష్టించి కబ్జాలు చేస్తున్నారన్నారు. వీటన్నింటిపై తహసీల్దార్ దృష్టి పెట్టి ప్రభుత్వ స్థలాలను కాపాడడం, పేద ప్రజలకు న్యాయం చేయాలన్నారు. చీకిలబైలు హైస్కూల్‌కు కేటాయించిన స్థలాన్ని పరిరక్షించి, భవన నిర్మాణాల నిధులు మంజూరు కోసం విద్యాశాఖ అధికారులు కృషి చేయాలన్నారు. పంటలకు సేంద్రీయ ఎరువులు ఉపయోగించేలా వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పీఆర్, పశుసంవర్ధకశాఖ, వ్యవసాయశాఖ, హార్టికల్చర్, ఉపాధి, మహిళా సమాఖ్య తదితర విభాగాల అధికారులతో సమీక్షించారు. ఎంపీపీ రెడ్డెమ్మ మాట్లాడుతూ సీటీఎం గ్రామం లో శ్మశానవాటికకు స్థలం లేక, వాగులు, వంకల్లో అంత్యక్రియలు నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. వెలుగు చంద్ర, ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, తహసీల్దార్ కిశోర్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలు నందినితాజ్, సర్పంచ్‌లు ప్రభాకర్, ఈశ్వరయ్య, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు చేదోడుగా నిలుద్దాం



విద్యార్థులకు నోటుపుస్తకాలు పంపిణీ చేస్తున్న నాగార్జునగాంధీ

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు ప్రతి ఒక్కరూ చేదోడుగా నిలవాలని టీడీపీ నేత, మున్సిపల్ కౌన్సిలర్ నాగార్జునగాంధీ పేర్కొన్నారు. ఆయన జన్మదినం సందర్భంగా కూరపర్తి సాయి చైతన్య అనాథాశ్రమంలో చిన్నారులకు అన్నదానం చేశారు. అనంతరం రూ.10వేల విలువైన నోటుపుస్తకాలను వితరణగా అందజేశారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాష, కౌన్సిలర్ నాగార్జునగాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శ్రీనివాసులునాయుడు, వంశీధర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

నిమ్మనపల్లి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లోనూ ముందంజలో వుండాలని ఎంపీడీఓ రమేష్ పేర్కొన్నారు. బుధవారం జడ్పీహైస్కూల్‌లో మండల స్థాయి క్రీడల పోటీలు నిర్వహిచారు. వాలీబాల్ బాలుర విభాగంలో అండర్ 17 కేశవరెడ్డి విన్నర్‌గా నిలవగా, రన్నర్‌గా రెడివారిపల్లి నిలిచింది. కబడ్డీ బాలుర విభాగం అండర్ 17లో బాలినాయునిపల్లి విన్నర్, రన్నర్‌గా నిమ్మనపల్లి నిలిచింది. బాలికల విభాగంలో కబడ్డీ నిమ్మనపల్లి జడ్పీహైస్కూల్ విన్నర్, రన్నర్‌గా మోడల్ స్కూల్ నిలిచింది. ఖోఖో బాలుర విభాగంలో కొమ్మిరెడ్డిగారిపల్లి విన్నర్, మోడల్ స్కూల్ రన్నర్‌గా నిలిచింది. అండర్ 14 బాయ్స్ విభాగంలో నిమ్మనపల్లి జడ్పీహైస్కూల్ విన్నర్, రన్నర్‌గా మోడల్ స్కూల్ నిలిచాయి. గురువారం కూడా క్రీడల పోటీలు జరుగుతాయని ఇందులో విజేతలు నియోజక వర్గ స్థాయిలో ఆడతారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ-1 పద్మావతి, ఎంఈఓ-2 నారాయణ, పీఈటీలు పాల్గొన్నారు.

### ప్రతిభ చాటిన 'ఆదర్శ' విద్యార్థులు

పెద్దతిప్పసముద్రం సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన క్రీడాపోటీల్లో ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్ 17 కబడ్డీ బాల, బాలికల విభాగం, అండర్ 14 బాలుర విభాగం, అండర్ 14 ఖోఖో బాలికల విభాగంలో సత్తా చాటినట్లు ప్రిన్సిపాల్ శివకుమారి పేర్కొన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థినీ, విద్యార్థులను ఎంఈఓ-1, ఎంఈ ఓ-2లు నారాయణ, గౌస్‌పీర్ అభినందించారు.

## సృష్టిలో విశ్వకర్మ మొదటి వాస్తు శిల్పి

**● హైందవ శంఖారావం పేరుతో ఘనంగా జయంతి వేడుకలు**



ఊరేగింపు ముందు విశ్వబ్రాహ్మణ నేతలు

కలికిరి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విశ్వకర్మ సృష్టికి ఇంజనీరింగ్ మూలపురుషుడని విశ్వ బ్రాహ్మణ సంఘం నేతలు కొనియాడారు. విశ్వకర్మ దేవతల శిల్పిగా ప్రసిద్దిగాంచిన వాస్తు శిల్పానికి ఆద్యుడన్నారు. పది చేతులతో ఆయన నిర్విరామంగా సృష్టిలోని ప్రతి వస్తువుకూ ఒక రూపం, ఆకారం ఇచ్చారని గుర్తు చేశారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా బుధవారం కలికిరిలో హైందవ శంఖారావం పేరుతో విశ్వ బ్రా హ్మణ సంఘం అధ్యక్షుడు హేమాచారి ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. స్థానిక అయ్యప్ప స్వామి ఆలయం వద్ద నుంచి క్రాస్‌రోడ్డు గాంధీ కూడలి వరకూ విశ్వకర్మ చిత్రపటాన్ని ఊరేగించారు. సంఘం గౌరవాధ్యక్షుడు, కలికిరి మాజీ సర్పంచు గోపీనాథ్, అధ్యక్ష ఉపాధ్యక్షులు హేమాచారి, అప్పాచారి, సంఘం నేతలు రత్నమాచారి, సిద్దప్పాచారి, రుద్రాచారి, జయాచారి, మోహనాచారి, వీరబ్రహ్మచారి, లోకేష్, వెంకటరణ, మల్లికార్జున, ధీరజ్ పాల్గొన్నారు.

## ఆలయానికి రూ.5.73 కోట్లు మంజూరు



విలేకరులతో మాట్లాడుతున్న కంభం నిరంజన్‌రెడ్డి

వాల్మీకిపురం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభి రామాలయం అభివృద్ధి కోసం టీటీడీ నుంచి రూ.5.73 కోట్లు మంజూరైంది. ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి వాల్మీకిపురంపై ప్రత్యేకశ్రద్ధ తీసుకోవడంతో పట్టాభిరామాలయ అభివృద్ధికి మహర్దశ సంతరించుకుందనే చెప్పాలి. పట్టాభిరామాలయ గరుడ పుష్కరిణి అభివృద్ధికి రూ.1.12 కోట్లు, స్థానిక తోటవీధిలోని ఆరుబయట శ్రీవారి కళ్యాణవేదిక మండపానికి రూ.73లక్షలు, రామాలయ దక్షిణ రాజగోపుర నిర్మాణానికి రూ.52లక్షలు, పట్టణ ఇరువైపుల ముఖద్వారాల్లో ఆర్చిల నిర్మాణ నిమిత్తం రూ. 30లక్షలు, ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల టీటీడీ కళ్యాణమండం అభివృద్ధికి రూ.1.80 కోట్లు, స్థానిక హసన్‌ఖాన్‌వీధిలోని పట్టాభిరాముడి పార్వేట మండపం మరమ్మతులు, నిర్మాణం కోసం రూ.1.26 కోట్లు నిధులు మంజూరు చేస్తూ మంగళవారం టీటీడీ బోర్డు ఆమోదించిందని వివరించారు. ఈ ఏడాది నిర్వహించిన పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాలు గతంలోకంటే మెరుగ్గా నిర్వహించడం పట్లకూడా ఎమ్మెల్యే నల్లారి కిశోర్ చొరవ చూపడం గమనార్హం. నియోజకవర్గ టీడీపీ సీనియర్ నేత, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ మాటలు చెప్పి దాటవేయడం కాకుండా వాల్మీకిపురంలో అభివృద్ధి ఏమిటో చేసి చూపిస్తామన్నారు. గుర్రంకొండ మండలం తరిగొండలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయ పుష్కరిణి నిర్మాణం కోసం రూ.1.50 కోట్లు టీటీడీ మంజూరు చేసిందన్నారు. త్వరలోనే టీటీడీ ఛైర్మన్ బీఆర్.నాయుడు, బోర్డుమెంబరు భానుప్రకాశ్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆధ్వర్యంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, పూజా కార్యక్రమాలు పూర్తి చేసి నిర్మాణ పనులు పూర్తి చేస్తామన్నారు. అడిగిన తక్షణం సహకరించిన టీటీడీ ఛైర్మన్ బీఆర్.నాయుడు, పాలకమండలి సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి, టీటీడీ ఈఓ, జేఈఓ వీరబ్రహ్మం, సీఈ సత్యనారాయణ, ఎస్ఈ మనోహర్, ఈఈ జగన్మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ కోసూరి చంద్రమౌళి, సింగిల్ విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, రాష్ట్ర కురవ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ, మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జున రెడ్డి, కూటమి నేతలు కె.రాజేంద్రాచారి, పులి నరేంద్ర, పీవీ.నారాయణ, కోసూరి రమేశ్, కేకే, బొక్కసం బ్రదర్స్, శేషాద్రిరెడ్డి, విష్ణు, రామాంజులురెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యం మెరుగుకు సహకరించాలి



వ్యాపారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ భానుప్రసాద్

కలకడ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ భానుప్రసాద్ సూచించారు. స్వచ్ఛాంధ్రలో భాగంగా బుధవారం కలకడ పట్టణంలోని హోటల్ యజమానులతో పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించిన ఆయన మాట్లాడుతూ చెత్తను ఇష్టాను సారం పడేయకుండా బుట్టలో వేయాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి ప్రత్యామ్నాయంగా అరటి ఆకులు, భూమిలో కుళ్లిపోయే స్వభావం కలిగిన వస్తువులను వాడాలని సూచించారు. అనంతరం డంపింగ్ యార్డు కేంద్రంలో 20వ తేదీన పది మండలాల కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్‌తో జరిగే శిక్షణపై సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు పీలేరులో కలెక్టర్ సమీక్ష

పీలేరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన నిశాంత్‌కుమార్ గురువారం పీలేరులో నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. బాధ్యతలు స్వీకరించిన తరువాత జిల్లాలో ఆయన చేపడుతున్న తొలి సమీక్ష సమావేశం కావడంతో పీలేరు రెవెన్యూ అధికారులు ఆయన పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారు. పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు ఆయన సమీక్ష చేపట్టనున్నట్లు తెలిసింది.

## టమోటా రైతులకు న్యాయం చేద్దాం

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌కు వచ్చే టమోటా రైతులకు అన్ని విధాలా న్యాయం చేద్దామని ఎమ్మెల్యే షాజహాన్‌బాష పేర్కొన్నారు. బుధవారం ఎమ్మెల్యే నివాసంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా నియమితులు కానున్న చల్లా నరసింహులు, మున్నానాయక్, సుబ్రమణ్యం రెడ్డిని సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను నిర్వహించి రైతులకు అండగా నిలవాలన్నారు. ఏఎంసీ డైరెక్టర్లను టీడీపీ నేతలు బాలుస్వామి, కత్తి లక్ష్మన్న, సొక్కం వేణు గోపాల్, విజయ్ కుమార్, మధుకర్‌రెడ్డి అభినందించారు.

## ఈహెచ్‌ఎస్ సమస్య లేకుండా చూడాలి

### వేడుకగా పెన్షనర్ల దినోత్సవం



విశ్రాంత ఉద్యోగులను సన్మానిస్తున్న సంఘం నేతలు

కలికిరి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగులకు అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు ఈహెచ్‌ఎస్ ద్వారా చికిత్సను సులభతరం చేయాలని జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆర్. రాజగోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక షాదీ మహల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు కూడా ప్రతి నెలా ఈహెచ్‌ఎస్ చందా చెల్లిస్తున్నారని, కనీసం నగదు రహిత వైద్య సౌకర్యాలను మెరుగుపరచాలని ప్రభుత్వాన్ని కోరారు. సంఘం కార్యదర్శి శంకరయ్య మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యలను వివరించారు. అక్టోబరు 5న మండల సంఘం ఆధ్వర్యంలో కలికిరిలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్న రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర రెడ్డి తెలిపారు. సంఘం గౌరవాధ్యక్షుడు విశ్రాంత ఉద్యోగులు ఆరోగ్యప్రదంగా జీవించేందుకు అవసరమైన జీవన విధానాలను వివరించారు. అనంతరం ఉద్యోగ విరమణ చేసిన విశ్రాంత ఉద్యోగులు జగన్నాథ రెడ్డి, విశ్వేశ్వర రావు, వెంకట్రమణ, రామమూర్తి, వేణుగోపాల్ రెడ్డి, కాంతమ్మను సన్మానించి మెమొంటోలు అందజేశారు. మండలంలోని విశ్రాంత ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## పరవళ్లు తొక్కుతున్న పింఛా



పీలేరు రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలో వెళుతున్న పింఛా నది జోరుగా ప్రవహిస్తోంది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు కురిసిన భారీ వర్షానికి వాగులు వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. సోమల మండలం ఆవులయ్యగారిపల్లె అటవీ ప్రాంతం నుంచి ప్రవహించే పింఛా నది జోరుగా వెళుతోంది. నదీ ప్రవాహాన్ని పట్టణ ప్రజలు ఆసక్తిగా తిలకించారు. పింఛాతోపాటు బడబళ్ల వంక సైతం జోరుగా ప్రవహిస్తోంది.

## నెలాఖరులోగా నిర్మాణాలను పూర్తి చేయాలి

ములకలచెరువు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నెలాఖరులోగా పక్కా గృహాల నిర్మాణాలు పూర్తి చేయాలని ఎంపీడీఓ హరినారాయణ ఆదేశించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాయంలో బుధ వారం హౌసింగ్‌పై సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షించి న ఆయన మాట్లాడుతూ దశల వారీ లేఅవుట్‌లలో అసంపూర్తిగా ఉన్న పక్కా గృహాల నిర్మాణాలు త్వరగా పూరయ్యేలా చూడాలన్నారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ములకలచెరువులో ఉదయం ఇంటింటి చెత్త సేకరణను పరిశీలించారు.

## పోషణ మాసోత్సవాలు ప్రారంభం

బి.కొత్తకోట, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్త్రీ శిశు ఆహారపు అలవాట్లు, ఆరోగ్యంపై నిర్వహించనున్న పోషణ మాసోత్సవాలను మండలంలో సీడీపీఓ భాగ్యమ్మ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. పట్టణంలోని అంగన్వాడీసెంటర్లు 2,3లలో గర్భిణులు, బాలింతలను సమావేశపరిచి కార్యక్రమం ప్రాధాన్యతను వివరించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడీల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.